ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5 చిత్తూరు జిల్లా వార్తలు

గురువారం 9 జనవరి 2025

అభివృద్ధి మంత్రం..

- కడాకు ప్రశంసలు.. నాయకులకు చురకలు
- విజయవంతంగా సీఎం చంద్రబాబు కుప్పం పర్యటన

పార్టీ శ్రేణులకు దూరం!


ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తున్న సీఎం చంద్రబాబు (ఫైల్ ఫొటో)

'నేను నాయకులను చూడడానికి రాలేదు, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి వచ్చాను.' ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం నియోజకవర్గ పర్యటనలో చెప్పిన ఈ మాటను ఆయన మూడ్రోజుల పర్యటనలో నిజం చేశారు. అభివృద్ధే అజెండాగా ఆయన పర్యటన ఆద్యంతం సాగింది. పర్యటనల్లోకంటే భిన్నంగా పార్టీ శ్రేణులను ఈసారి చంద్రబాబు దూరం పెట్టారు. ప్రభుత్వాధికారులకు అధిక ప్రాధాన్యమిచ్చారు. ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతోనే పూర్తిగా మమేకం అయ్యారు.

కుప్పం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు రాష్ట్రానికి ముఖ్యమంత్రి మాత్రమే కాదు, కుప్పం నియోజకవర్గానికి ఎమ్మెల్యే కూడా. ఆయన ఈ రెండు హోదాల్లో మాత్రమే ఈసారి సొంత నియోజకవర్గమైన కుప్పంలో పర్యటించారు. పేరుకు మూడ్రోజుల పర్యటన అయినా, ఆయన పాల్గొన్న కార్యక్రమాలు ఈనెల 6, 7 తేదీల్లోనే ముగిసిపోయాయి. మూడో రోజైన బుధవారం శాంతిపురం మండలం కడపల్లె వద్ద నిర్మాణంలో స్వగృహాన్ని పరిశీలించాలని, కుప్పం మున్సిపాలిటీలలో ఆకస్మిక తనిఖీలు చేయాలని అనుకున్నారు కానీ, అది సాగలేదు. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ నుంచి హెలికాప్టర్‌లో బెంగళూరు.. అక్కడినుంచి విశాఖపట్టణం బయల్దేరి వెళ్లిపోయారు. ఈసారి తన పర్యటనలో పార్టీ నేతగాకాక పక్కా ప్రభుత్వాధినేతగానే వ్యవహరించారు. 6వ తేదీన అతి ముఖ్యమైన సౌర విద్యుత్తు ప్రాజెక్ట్‌ను నడిమూరులో ప్రారంభించారు. రాష్ట్రం మొత్తం విస్తరించనున్న ఈ కార్యక్రమం ద్వారా భవిష్యత్తులో ప్రజలకు ఉచిత విద్యుత్తు అందనుంది. స్వర్ణ కుప్పం విజన్ డాక్యుమెంట్ 2029ను ఆవిష్కరించి, పది అంశాలతో కూడిన అభివృద్ధిని కుప్పం నియోజకవర్గానికి చంద్రబాబు వాగ్దానం చేశారు. ప్రకృతి వ్యవసాయాన్ని రాష్ట్రమంతటా అమలు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేసి, సంబంధిత రైతులతో మాట్లాడడమే కాకుండా ఆమేరకు విజన్ 2029ను ఆవిష్కరించారు. పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. 7వ తేదీన అసలైన కుప్పం అభివృద్ధి కార్యక్రమాలకు అంకురార్పణ జరిగింది. తొలుత టీడీపీ కార్యాలయంలో జన నాయకుడు పోర్టల్ ప్రారంభించడమేకాక, ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. ఏకంగా 550 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, స్వయం సహాయక సంఘాలకు రుణాలు పంపిణీ చేశారు.

అలుపెరగని నేత

సీఎం చంద్రబాబు 74 ఏళ్ల వయసులోనూ ఎప్పటిలాగే అర్ధరాత్రుళ్ల వరకు సమీక్షలు, సమావేశాలు నిర్వహించారు. తొలి రోజు మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో ద్రావిడ హెలిపాడ్‌కు చేరుకోగా.. ఆ రోజు అర్ధరాత్రి 12 గంటల వరకు వరుస కార్యక్రమాలతో బిజీబిజీగా గడిపారు. రెండోరోజు కూడా అదే రీతిలో సాగింది. జన నాయకుడు పోర్టల్ ప్రారంభ సమయంలో అయితే ఒక్కో అంశాన్ని సిబ్బందిని అడిగి ప్రాక్టికల్‌గా తెలుసుకున్నారు. సమస్యలున్నవారితో వ్యక్తిగతంగా మాట్లాడి న్యాయం చేశారు. ఎక్కడా కాసింత అలసట కూడా లేకుండా ఎప్పటిలాగే ఆయా అంశాల మీద సుదీర్ఘంగా చర్చించారు. ఆయన ఓపిక, ఆయా అంశాల మీద లోతుగా ఉన్న అవగాహన, వివరిస్తున్న తీరు, భవిష్యత్తుపై ఉన్న విజన్‌లను చూసి ఉన్నతాధికారులు, ఆయా కంపెనీల సీఈవోలు సైతం ఆశ్చర్యపోయారు. వారంతా అలసిపోతున్నా.. ఈయన మాత్రం అలుపు లేకుండా పర్యటించారు.

అలీప్, మదర్ డెయిరీ, శ్రీజ డెయిరీ తదితర ప్రతిష్ఠాత్మక సంస్థలు కుప్పం రానున్నాయి. అలాగే టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, బిగ్ బాస్కెట్ వంటి సంస్థలతో ఒప్పందాలు కుదిరాయి. కుప్పం అభివృద్ధితో పాటు స్థానికుల ఆరోగ్యం, ఆదాయం, ఆనందమే ప్రధాన ధ్యేయంగా సాగిన ముఖ్యమంత్రి పర్యటన ఆ కోణంలో పూర్తిగా విజయవంతమైంది.

కడాకు ప్రశంసలు

సీఎంగా చంద్రబాబు బాధ్యతలు తీసుకున్నాక రెండోసారి కుప్పంలో సాగిన పర్యటన ఇది. అలాగే గత ఐదేళ్ల విధ్వంస పాలన తర్వాత కుప్పం అభివృద్ధిని తిరిగి గాడిలో పెట్టడానికి కుప్పం డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) ఏర్పాటు చేశాక మొదటి పర్యటన కూడా ఇదే. యువ ఐఏఎస్ అధికారి వికాస్ మర్మత్‌ను కడా ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా నియమిస్తూ తీసుకున్న నిర్ణయం సరైనదేనని ఈ పర్యటనలో రుజువైంది. పలు ప్రతిష్ఠాత్మక సంస్థలు తమ పరిశ్రమలను కుప్పంలో ఏర్పాటు చేయడానికి ముందుకు రావడంలో కడా తరఫున పీడీ విశేష కృషి చేశారు. కలెక్టర్ మద్దతుతో, ముఖ్యమంత్రి ఇచ్చిన ప్రోత్సాహంతో ప్రతిష్ఠాత్మకమైన సంస్థల ప్రతినిధులను ఈ మారుమూల కుప్పానికి రప్పించి ఎంవోయూలు కుదర్చడంలో వికాస్ మర్మత్ పాత్ర గణనీయంగా ఉంది. పీడీ కృషిని గుర్తించిన ముఖ్యమంత్రి.. ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమ వేదిక మీదినుంచే ప్రశంసించారు. 'కడా చాలా బాగా చేసింది. వారికి నా అభినందనలు' అంటూ కితాబునిచ్చారు. ఈ ప్రశంసలు భవిష్యత్తులో మరిన్ని ప్రతిష్ఠాత్మక సంస్థలను కుప్పం రప్పించి, ఇక్కడి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగ పరచడానికి కడా పీడీ వికాస్ మర్మత్‌కు ప్రోత్సాహాన్ని ఇస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదు.

పార్టీ శ్రేణులకు కాస్త దూరం

చంద్రబాబు ఈసారి కుప్పం పర్యటనలో తెలుగుదేశం పార్టీ అధినేతగా నేతలను మందలించడానికే పరిమితం అయ్యారు. సోలరైజేషన్ కార్యక్రమం సందర్భంగా కుప్పం మండలం నడిమూరులో ఏర్పాటు చేసిన సభలో పార్టీ కండువాలు, ట్యాగ్‌లు తీసేయమంటూ కుప్పం ఎంపీడీవో.. టీడీపీ కేడర్‌కు విజ్ఞప్తి చేయడం కార్యకర్తల్లో అసహనానికి దారితీసింది. రెండో రోజు జరిగిన విలేకరుల సమావేశంలో ఎంపీడీవో ప్రవర్తనను ముఖ్యమంత్రి ఖండించారు. కార్యకర్తలే తనకు ముఖ్యమని ప్రకటించారు. తొలిరోజున ద్రావిడ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో పార్టీ శ్రేణులతో చంద్రబాబు సమావేశమైనా.. రెండ్రోజులపాటు అభివృద్ధి కార్యక్రమాలలో వారికి విశేష ప్రాధాన్యం అయితే ఇవ్వలేదు.

'నామినేటెడ్' సందడి

త్వరలో నామినేటెడ్ పదవుల్ని భర్తీ చేయనున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబును కలిసి ప్రసన్నం చేసుకోవడానికి ఉమ్మడి జిల్లా నాయకులు ఎగబడ్డారు. ఫలానా నియోజకవర్గంలో.. ఫలానా ఏళ్లుగా కష్టపడుతున్నానని.. ఫలానా పదవి తనకు ఇవ్వాలని వినతులు అందించారు. తొలి రోజు ఇన్‌చార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డితోపాటు జిల్లా ఎమ్మెల్యేలు అమర్నాథ్ రెడ్డి, గురజాల జగన్మోహన్, గాలి భానుప్రకాష్, మురళీమోహన్, థామస్, ఆదిమూలం, పార్లమెంట్ అధ్యక్షుడు సీఆర్ రాజన్.. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ, ఏఎస్ మనోహర్, స్టేట్ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ తదితరులు కలిసి హెలిపాడ్‌లో సీఎంకు స్వాగతం పలికారు. తొలి రోజు తొలి కార్యక్రమం 'స్వర్ణ కుప్పం విజన్- 2029' డాక్యుమెంట్‌ను ఆవిష్కరించిన ఆయన.. జిల్లా ఎమ్మెల్యేల్ని వేదిక మీద కూర్చోబెట్టారు. సీఎం నిర్వహించిన ప్రతి కార్యక్రమంలోనూ ఎంపీ దగ్గుమళ్ల, ఎమ్మెల్సీ కంచర్ల వెంటే ఉన్నారు.

డీఐజీ, ఎస్పీసహా రెండు జిల్లాల పోలీసులు

సీఎం ప్రతి కార్యక్రమంలో ఆయన సెక్రటరీ, సీనియర్ ఐఏఎస్ ప్రద్యుమ్న, కలెక్టర్ సుమిత్‌కుమార్, కడా పీడీ వికాస్ మర్మత్ పక్కనే ఉన్నారు. అడుగడుగునా సీఎం వారిలో ఎవరినో ఒకర్ని పిలిచి ఆయా పనుల్ని అప్పగించేవారు. అనంతపురం డీఐజీ షెమోషి, ఎస్పీ మణికంఠ, ఏఎస్పీ రాజశేఖర్ రాజు సీఎం మూడు రోజుల పర్యటనలో అక్కడే ఉండి బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి పెద్దఎత్తున పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు.

ఆనంద 'జల'

చంద్రబాబు ఆదేశంతో పేద రైతు పొలంలో నీటి సిరులు


చలపతి పొలంలో బిగిస్తున్న పంప్‌సెట్

కుప్పం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశంతో రాత్రికిరాత్రి అధికారులు వేసిన బోరుబావితో ఆ పేద రైతు జీవితంలో వెలుగు నిండింది. 'జై చంద్రబాబు.. జై జై చంద్రబాబు' అన్న అసంకల్పిత నినాదం ఆయప్ప నోటివెంట వెలువడింది. శాంతిపురం మండలం సోమాపురం గ్రామానికి చెందిన నిరుపేద వృద్ధ రైతు చలపతి. సహకార బ్యాంకులో చేసిన రూ.50వేల రుణం ఏకంగా రూ.85వేలకు చేరింది. బ్యాంకు అధికారులు గొంతుమీద కూర్చొన్నారు. హంద్రీ-నీవా కాలువకు ఉన్న పొలంలో ముప్పావువంతు వెళ్లిపోయింది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పరిహారం సైతం అందలేదు. మిగిలిన కొద్దిపాటి పొలమైనా పండించుకుందామన్న ఆశతో శక్తికి మించి వ్యయం చేసి బోరుబావి తవ్వించారు. అయితే విద్యుత్తు పంప్‌సెట్ కావాలి. అప్పటికే అప్పులపాలైన చలపతికి అదెలా సాధ్యమవుతుంది.. కాలేదు. ఏమిచేయాలో పాలుపోలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం వస్తున్నారని తెలిసి. ఎన్నో ఆశలతో చలపతి ఈనెల 7వ తేదీన తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జన నాయకుడు పోర్టల్ ప్రారంభం సందర్భంగా అర్జీ ఇవ్వడానికి వచ్చారు. ఆయన అదృష్టం.. స్వయంగా చంద్రబాబే ఆయనుంచి అర్జీని స్వీకరించారు.. ఆ పేద వృద్ధ రైతు ఏకరువు పెట్టిన కష్టాలను సావధానంగా ఆలకరించారు. చలపతి రుణాన్ని రీషెడ్యూల్ చేయమని చెప్పడంతోపాటు 48 గంటల్లో ఆయన పొలంలో విద్యుత్తు మోటారు ఏర్పాటు చేసి, పైపులైన్లు బిగించాలని అధికార గణానికి ఆదేశాలు జారీ చేశారు. అంతే.. అధికార యంత్రాంగం వెంటనే స్పందించింది. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పురుషోత్తం ఆధ్వర్యంలో ఆ శాఖ అధికారులు అదేరోజు సాయంత్రం సోమాపురం వెళ్లారు. చలపతి పొలంలో 10 హెచ్‌పీ/30 విద్యుత్తు పంప్‌సెట్ ఏర్పాటు చేశారు. అదేరోజు రాత్రి భూగర్భంనుంచి జల ఉప్పొంగి పొలంలోని పంటను తడిపింది. ఇది చూసిన పేద రైతు చలపతి ఆనందం పట్టలేకపోయారు. 'నా దేవుడు చంద్రబాబు. ఆయనకు నేనేకాదు మా కుటుంబం మొత్తం జీవితాంతం రుణపడి ఉంటాము' అంటూ చంద్రబాబుకు జైకొట్టారు.


రాత్రికిరాత్రి పంప్‌సెట్ బిగించి పైపులైన్లు ఏర్పాటు చేయడంతో ఉప్పొంగుతున్న జలం

బైరాగిపట్టెడ కేంద్రం వద్ద ..



ఏమిటిది స్వామీ !

భక్తుల ప్రాణాలు తీసిన ఆశ... ఆత్రుత

- ఆరుగురి దుర్మరణం
- మృతుల్లో ఐదుగురు మహిళలు
- స్విమ్స్, రుయాల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు
- రుయాలో నలుగురి పరిస్థితి ఆందోళనకరం
- కలెక్టరేట్‌లో 0877 2236007 నెంబరుతో కంట్రోల్ రూం ఏర్పాటు
- ప్రాణాలు తీసిన బైరాగిపట్టెడ కేంద్రం



తిరుపతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ద్వార దర్శనంతో పుణ్యం దక్కుతుందనే ఆశ వారి ప్రాణాలు తీసింది. టీటీడీ చరిత్రలో ఎన్నడూ జరగని ఘోర సంఘటనకు దారి తీసింది. తిరుపతిలోని బైరాగిపట్టెడ రామానాయుడు మున్సిపల్ హైస్కూలు ఆవరణలో ఏర్పాటు చేసిన టోకెన్ల జారీ కేంద్రం ఆరుగురి పాలిట మృత్యు ప్రాంగణమైంది. వీరిలో ఐదుగురు మహిళలు. మధ్యాహ్నానికే తిరుపతిలోని ఎనిమిది టోకెన్ల జారీ కేంద్రాల వద్దకు తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుంచీ ఏపీ, తెలంగాణలలోని అనేక ప్రాంతాల నుంచీ అసంఖ్యాకంగా భక్తులు తరలివచ్చారు. నీళ్ళు తిండి అని కూడా చూసుకోకుండా కేంద్రాల బయట ఎదురుచూశారు. గురువారం తెల్లవారుజామున ఐదింటికి టోకెన్ల జారీ అని ప్రకటించిన టీటీడీ రద్దీ పరిస్థితిని చూసి అర్ధరాత్రి పన్నెండింటి నుంచే టోకెన్లు జారీ చేయాలని భావించింది. తొమ్మిదింటి నుంచీ క్యూలైన్లలోకి భక్తులను అనుమతించారు. ఈ క్రమంలో ఒక్కసారిగా భక్తులు క్యూలైన్లలోకి ప్రవేశించడానికి పోటెత్తారు. బైరాగిపట్టెడ కేంద్రం పక్కనే పార్కులో వేచి వున్న భక్తులు క్యూలైన్లలోకి ప్రవేశించడానికి గేటు వద్దకు తోసుకువచ్చారు. రాత్రి 8.50 గంటల సమయంలో మూసివున్న గేటును భక్త లు నెట్టుకుంటూ రావడంతో గేటు ఒక్కసారిగా తెరుచుకోవడంతో నియంత్రణ కోల్పోయారు. దీంతో తొక్కిసలాట జరిగింది. ఒకరినొకరు తొక్కుకుంటూ క్యూలైన్ల వైపు పరుగులు తీశారు. కిందపడిపోయిన భక్తుల ఆర్తనాదాలు, హాహాకారాలతో బైరాగిపట్టెడ హోరెత్తిపోయింది. ఈ కేంద్రం వద్ద భద్రతకు నియమించిన పోలీసు, టీటీడీ విజిలెన్స్ సిబ్బంది ఉప్పెనలా దూసుకొచ్చిన భక్తులను అదుపు చేయలేకపోయారు. తోపులాటలో ఊపిరాడక అనేక మంది మహిళలు అపస్మారక స్థితికి చేరుకున్నారు. ఫోన్లు చేసి అంబులెన్సులు వచ్చేలోగా పోలీసు సిబ్బంది, స్థానికులు పడిపోయిన భక్తులకు సపర్యలు చేసే ప్రయత్నం చేశారు. కొందరికి సీపీఆర్ కూడా చేశారు. సరైన శిక్షణ లేకుండా సీపీఆర్ చేస్తున్న దృశ్యాల వీడియోలు వైరల్ అయ్యాయి.



గాయపడినవారిని రుయా, స్విమ్స్ ఆస్పత్రులకు తరలించారు. వైకుంఠ ద్వార దర్శనం టోకెన్లు జారీ మొదలు పెట్టే సమయానికే జరగరాని ఘోరం జరిగిపోయింది. ఆ తర్వాత యధా ప్రకారం బైరాగి పట్టెడ కేంద్రంలో కూడా టోకెన్ల జారీ కొనసాగింది. అర్ధరాత్రి 12 గంటల సమయానికి వైకుంఠ ఏకాదశి రోజుకు సంబంధించిన 38 వేల టోకెన్ల జారీ పూర్తయింది. 12.30 గంటల సమయానికి వైకుంఠ ద్వాదశికి సంబంధించిన టోకెన్లలో 4500 టోకెన్లు పంపిణీ చేశారు.

- మిగతా వివరాలు 8లో -

ప్రశాంతంగా వైకుంఠద్వార దర్శనం

- భక్తులు ఆందోళన పడవద్దని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడి పిలుపు
- కొత్త వైరస్ ప్రచారం నేపథ్యంలో మాస్కులతో రావాలని సూచన



'తిరుమల ఆలయంలో పదిరోజుల పాటు వైకుంఠద్వారాలు తెరిచే ఉంటాయి. కంగారు పడాల్సిన అవసరం లేదు. ప్రశాతంగా టోకెన్లు పొందండి. వైకుంఠద్వార దర్శనాలు చేసుకోండి' అని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు సూచించారు. వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను బుధవారం ఆయన తిరుమలలోని అన్నమయ్య భవనంలో మీడియాకు వివరించారు. 3 వేల మంది పోలీసులు, 1,500 వందల మంది విజిలెన్స్ సిబ్బందితో భక్తులకు భద్రత కల్పిస్తామన్నారు. ఇక, వైకుంఠద్వార దర్శన రోజుల్లో టోకెన్లు లేని భక్తులకు దర్శనాలు ఉండవని మరోసారి స్పష్టం చేశారు. కాగా కొత్త వైరస్ వస్తోందనే ప్రచారం జరుగుతున్న క్రమంలో భక్తులు మాస్కులు ధరించి అన్ని జాగ్రత్తలతో తిరుమలకు రావాలని టీటీడీ చైర్మన్ కోరారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



శ్రీధర్‌బాబు



బెల్లంకొండ సురేష్ - గౌతమ్ సింఘానియా

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల, జనవరి8(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, సినీనిర్మాత బెల్లంకొండ సురేష్, రేమాండ్ సంస్థ అధినేత గౌతమ్ సింఘానియా, మాజీ ఎంపీ చింతా మోహన్ ఉన్నారు.


సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 13 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

సోమవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.20 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 62,566

తలనీలాలు సమర్పించినవారు: 16,021



సంక్రాంతికి కూ..చుక్..చుక్

- తిరుపతి- హైదరాబాదుల మధ్య ప్రత్యేక రైళ్లు



తిరుపతి(సెంట్రల్), జనవరి8 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా ప్రయాణికుల రద్దీని తగ్గించడానికి దక్షిణ మధ్య రైల్వే తిరుపతి- హైదరాబాదు మధ్య సంక్రాంతి ప్రత్యేక రైళ్ళను నడుపనున్నట్లు ఆ రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు. హైదరాబాదు కేంద్రంగా పలుప్రాంతాలకు ప్రత్యేక రైళ్ళు నడుపుతున్నామని తెలిపారు.

- చర్లపల్లినుంచి తిరుపతికి ప్రత్యేక రైలు (02764) బుధవారం సాయంత్రం 6.55 గంటలకు బయలుదేరి జనగాం, ఖాజీపేట, వరంగల్, మహబూబాబాదు, ఖమ్మం, విజయవాడ, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా మరుసటి రోజు ఉదయం 7.15 గంటలకు తిరుపతికి చేరుకొంటుంది.
- తిరుపతిలో ఈ ప్రత్యేక రైలు(02763) గురువారం సాయంత్రం 4.55 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ మరుసటిరోజు ఉదయం 6 గంటలకు చర్లపల్లికి చేరుకొంటుంది.
- ప్రత్యేక రైలు ఈ నెల 11,15 తేదీల్లో చర్లపల్లి నుంచి తిరుపతికి, 9,12,16 తేదీల్లో తిరుపతి నుంచి చర్లపల్లికి రాకపోకలు నిర్వహిస్తాయి.
- కాచిగూడలో మరో ప్రత్యేక రైలు(07655) ఈ నెల 9వ తేది సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరి మల్కాజ్‌గిరి, చర్లపల్లి జనగాం, ఖాజీపేట, వరంగల్, మహబుబ బాదు, డోర్నకల్, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంటల మీదుగా మరుసటి రోజు ఉదయం 7.30 గంటలకు తిరుపతికి చేరుకొంటుంది.
- ఈ ప్రత్యేక రైలు 10వ తేది రాత్రి 8.05 గంటలకు బయలు దేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ మరుసటి రోజు ఉదయం 9.30 గంటలకు కాచిగూడకు చేరుకొంటుది.
- ప్రత్యేక రైలు ఈ నెల 16న కాచిగూడ నుంచి తిరుపతికి, 10, 17 తేదీల్లో తిరుపతి నుంచి చర్లపల్లికి రాకపోకలు నిర్వహిస్తాయి.

యూనివర్సిటీ వీసీల నియామకానికి

సెర్చ్ కమిటీల ఏర్పాటు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యూనివర్సిటీ వీసీల నియామక సెర్చ్ కమిటీలు ఏర్పాటయ్యాయి. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం బుధవారం జారీ చేసింది. ఎస్వీయూ సెర్చ్ కమిటీలో.. రాష్ట్ర ప్రభుత్వ నామినీగా రాయ్‌పూర్ ఐఐఎం డైరెక్టర్ డాక్టర్ రాంకుమార్ కాకాని, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నామినీగా ఎస్ఆర్ఎం యూనివర్సిటీ మాజీ వీసీ వీఎస్ రావు, యూజీసీ నామినీగా అహ్మదాబాదులోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ అమి యు. ఉపాధ్యాయను నియమించారు. పద్మావతి వర్సిటీ సెర్చ్ కమిటీలో.. రాష్ట్ర ప్రభుత్వ నామినీగా నన్నయ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ నిరుపమ రాణి, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నామినీగా హైదరాబాదు ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి, యూజీసీ నామినీగా మధ్యప్రదేశ్‌కు చెందిన హరిసింగ్ గౌర్ వర్సిటీ వీసనీ ప్రొఫెసర్ నీలిమ గుప్తాను నియమించారు. ● ద్రవిడ వర్సిటీ సెర్చ్ కమిటీలో.. రాష్ట్ర ప్రభుత్వ నామినీగా గౌహతికి నైపర్ సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ యుఎస్ఎన్ మూర్తి, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నామినీగా రాష్ట్ర ఉన్నత విద్యామండలి మాజీ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పి.నరసింహారావు, యూజీసీ నామినీగా ఢిల్లీకి చెందిన లివర్ అండ్ బిలియరీ సైన్స్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్‌కె సరిన్‌ను నియమించారు. ఆయా వర్సిటీల వీసీల నియామకానికి ఇప్పటికే నోటిఫికేషన్ వెలువడింది. దరఖాస్తులూ స్వీకరించారు. దరఖాస్తులను పరిశీలించి ముగ్గురి పేర్లను ఈ సెర్చ్ కమిటీలు గవర్నర్‌కు సిఫారసు చేయనున్నాయి.

ప్రధాని నోట..

శ్రీసిటీ ప్రగతి మాట

శ్రీసిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతిని ప్రధాని మోదీ ప్రశంసించారు. బుధవారం సాయంత్రం విశాఖపట్నం బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ.. శ్రీసిటీ పారిశ్రామిక నగరం వల్ల ఉత్పత్తి రంగంలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు ప్రస్తావించారు. పారిశ్రామికంగా దేశంలోనే అగ్రగామి రాష్ట్రాలలో ఒకటిగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడం తమ లక్ష్యం అన్నారు. ఇప్పటికే శ్రీసిటీ రూపంలో ఏపీ తయారీ రంగం ఊపందుకుందని వివరించారు. కేంద్ర పీఎల్ఐ, ఇతర పథకాలు వినియోగించుకుని మరింత పురోగతి సాధించాలని ఆకాంక్షించారు. మేక్ ఇన్ ఇండియా చొరవకు ప్రతిబింబంగా అంతర్జాతీయ కీర్తి గడించి, సుస్థిర అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్న శ్రీసిటీకి ప్రధాని కితాబు దక్కడం అభినందనీయం.

బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోండి

- నివేదికను కోర్టు ముందుంచండి ● తిరుపతి కలెక్టర్‌కు హైకోర్టు ఆదేశం

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా పెళ్లకూరు మండల పరిధిలో అక్రమంగా నిర్వహిస్తున్న మద్యం బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలంటూ విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. పెళ్లకూరు మండలం పరిధిలోని వివిధ గ్రామాల్లో మద్యం బెల్ట్ షాపులను అరికట్టేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ నన్నం ప్రిస్కిల్లా మరొకరు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. మద్యం అమ్ముతున్న బెల్ట్ షాపులు, వాటికి మద్యం సరఫరా చేస్తున్న మద్యం షాపు యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది పి.సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. అనధికారికంగా బెల్టు షాపులు నిర్వహిస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదన్నారు. పిటిషనర్లు ఇచ్చిన వినతులపై స్పందించలేదన్నారు.

పొగ మంచుతో పలు విమానాలు ఆలస్యం

రేణిగుంట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పొగమంచు కారణంగా తిరుపతి విమానాశ్రయంలో పలు విమానాలు ఆలస్యంగా నడిచాయి. బుధవారం ఉదయం హైదరాబాదు, ముంబై, ఢిల్లీ నుంచి నడుస్తున్న స్పైస్‌జెట్, ఇండిగో, ఎయిర్ అలయన్స్ విమానాలు దట్టమైన పొగమంచు కారణంగా 25 నిమిషాలు ఆలస్యంగా నడిచాయి.

- 16 సవర్లు రికవరీ చేసిన పోలీసులు

ఒంటరి వృద్ధురాలిపై దాడిచేసి

బంగారు నగలు దోచుకెళ్లిన మహిళ అరెస్ట్



నిందితురాలు వల్లెమ్మ అరెస్టును చూపుతున్న పోలీసులు

నారాయణవనం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఒంటరి వృద్ధురాలిపై దాడిచేసి బంగారు నగలు దోచుకెళ్లిన మహిళను అరెస్టు చేసినట్లు డీఎస్పీ రవికుమార్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నారాయణవనం నవసందులో ఓసూరమ్మ(89) అనే వృద్ధురాలు ఒంటరిగా కాపురం ఉంటున్నారు. అదే వీధిలో టిఫిన్ అంగడి నడుపుకుని జీవనం సాగిస్తున్న ఎం.వల్లెమ్మ వృద్ధురాలు ఓసూరమ్మ ఒంటిపై ఉన్న బంగారు నగలపై కన్నేసింది. ఈ నేపథ్యంలో వృద్ధురాలితో అప్పడప్పుడు మాటామంతీ కలిపి పరిచయం పెంచుకుంది. ఈ నెల 5వ తేది ఆదివారం మధ్యాహ్నం 1 గంటకు ఓసూరమ్మ ఇంట్లో ఒంటరిగా ఉండటాన్ని గమనించిన వల్లెమ్మ వృద్ధురాలు దగ్గరికెళ్లి మాటలు కలిపి, దాడి చేసింది. దీంతో అపస్మారక స్థితిలో పడిపోయిన ఓసూరమ్మ శరీరంపై ఉన్న 16 సవర్ల చైన్, ముక్కు, కమ్మలను దొంగలించుకుని వెళ్లిపోయింది. వృద్ధురాలి చెల్లి కుమారుడు అయ్యప్పన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేపట్టినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా ఉన్న వల్లెమ్మ గురించి వాకబు చేయగా, కైలాసకోనలో ఉన్నట్లు గుర్తించి ఆమెను విచారించారు. విచారణలో ఆమె వృద్ధురాలిపై దాడి చేసి, 16 సవర్ల బంగారు నగలు దొంగిలించినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆమెను అరెస్టు చేసి, బంగారు నగలను రికవరీ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. కేసును రెండు రోజుల్లో ఛేదించిన పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవుల మృతి



మృతిచెందిన రెండు పాడి ఆవులు

కల్లూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మేత కోసం వెళుతున్న పాడి ఆవులను యమపాశంగా మారిన విద్యుత్ తీగలు కబళించడంతో అభశుభం తెలియని రెండు మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీ కుమ్మరిపల్లె సమీపంలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన పాడి రైతు గొర్రెపాటి మధు బుధవారం ఉదయం తనకున్న పాడి ఆవులు, పేయదూడలతో అడవికి బయల్దేరాడు. మార్గమధ్యంలోని పరికిబండ సమీపంలో 11 కేవీ విద్యుత్ తీగలు తెగి కిందపడ్డాయి. ముందు వరుసలో రెండు పాడి ఆవులకు నేలపై ఉన్న విద్యుత్ తీగలు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాయి. గమనించిన రైతు అప్రమత్తమై మిగిలిన పేయ దూడలు, వెనుక వైపు వస్తున్న సుమారు 15 పాడి ఆవులను వెనక్కు మళ్లించాడు. పాడి ఆవులు మృతి చెందిన విషయంపై కల్లూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు, ట్రాన్స్‌కో ఏఈ పురుషోత్తంలకు బాధితుడు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని ట్రాన్స్‌కో ఏఈ, పోలీసులు పరిశీలించారు. ఆవుల కళేబరాలకు పశువైద్యాధికారి మునిచంద్ర పోస్టుమార్టం నిర్వహించారు. రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు తదితర ప్రాజెక్టుల భూసేకరణ, నిర్మాణ పనులు మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. కడప-రేణిగుంట, తిరుపతి-మదనపల్లె, రేణిగుంట-నాయుడుపేట ఆరులేన్ల పనులను వేగవంతం చేయాలన్నారు. రేణిగుంట నుంచి చెన్నై వరకు నాలుగు లేన్ల రహదారి విస్తరణ పనులు కూడా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే నడికుడి-శ్రీకాళహస్తి ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణలో ఇబ్బందులు లేకుండా ఆర్డీవోలు, తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలన్నారు. తిరుపతి-పాకాల రైల్వేట్రాక్ డబుల్ లైన్‌కు సంబంధించిన భూసేకరణ పనుల్లో పురోగతి ఉండాలని ఆదేశాలిచ్చారు. జేసీ శుభం బన్సల్‌తోపాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.



విరాళాన్ని అందజేస్తున్న దాత

అన్నప్రసాదానికి

50 వేల అమెరికన్ డాలర్ల విరాళం

తిరుమల, జనవరి8(ఆంధ్రజ్యోతి): శ్రీవారి అన్నప్రసాదం ట్రస్టుకు బుధవారం 50 వేల అమెరికన్ డాలర్లు విరాళంగా అందాయి. అమెరికాలోని చికాగోకు చెందిన ఎన్ఆర్ఐ భక్తుడు పెరంబదూర్ కందల శ్రీనివాసాచార్య ఈవిరాళాన్ని అందజేశారు. డాలర్లను బుధవారం రాత్రి టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడికి దాత అందజేశారు.

టీటీడీకి 'పర్యావరణ హిత' సంస్థల ఝలక్

- మూడేళ్లుగా అద్దె చెల్లించకుండానే లడ్డూ కవర్ల విక్రయాలు
- ఇటీవల కౌంటర్లు స్వాధీనం చేసుకున్న టీటీడీ

తిరుమల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ హిత కవర్ల విక్రయ సంస్థలు టీటీడీకి ఝలక్ ఇచ్చాయి. దాదాపు మూడేళ్ల పాటు టీటీడీకి ఎలాంటి అద్దెను చెల్లించకుండా లడ్డూ కవర్ల విక్రయాలు నిర్వహిస్తున్న క్రమంలో టీటీడీ ఇటీవల కౌంటర్లను మూసివేసి, స్వాధీనం చేసుకుంది. తిరుమలలో పర్యావరణ పరిరక్షణ కోసం టీటీడీ నాలుగేళ్ల కిందట ప్లాస్టిక్‌ను నిషేధించిన విషయం తెలిసిందే. తొలత ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లను నిషేధించిన టీటీడీ తర్వాత ప్లాస్టిక్ కవర్ల వినియోగం ఉండకూడదనే నిబంధనను పెట్టింది. భక్తులు లడ్డూల కోసం వినియోగించే కవర్లను కూడా నిషేధించింది. ఇందులో భాగంగానే స్వీట్స్ తీసుకెళ్లేందుకు వినియోగించే పేపర్ బ్యాక్సులను, తర్వాత క్లాత్ బ్యాగులను, పేపర్ బ్యాగులను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇవి లడ్డూలకు ఉండే నెయ్యిని పీల్చేస్తుండటం, ధర అధికంగా ఉండటంతో భక్తులు వీటిపై ఆసక్తి చూపలేదు. కొంతకాలం తర్వాత బయో డిగ్రేడబుల్ కవర్లు తెరపైకి వచ్చాయి. తొలుత 2021 ఫిబ్రవరిలో గ్రీన్ మంత్ర కవర్లు, అదే ఏడాది ఆగస్టులో డీఆర్డీవో సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన కవర్లతో మరో సంస్థ ద్వారా బయో డిగ్రేడబుల్ కవర్ల విక్రయాలు మొదలయ్యాయి. అయితే వీరు కొన్నేళ్లుగా అద్దె చెల్లించని నేపథ్యంలో ఇటీవల టీటీడీ అధికారులు లడ్డూకౌంటర్‌లో వారి విక్రయాల కోసం కేటాయించిన కౌంటర్లను మూసివేసి స్వాధీనం చేసుకున్నారు. అయితే వీరి నుంచి ఎంత అద్దె రావాలి, వారిపై టీటీడీ ఎలాంటి చర్యలు తీసుకుంటుందో తెలియాల్సి ఉంది.

రెవెన్యూ సదస్సులకు 149 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు ప్రజల నుంచి భారీ స్పందన లభిస్తోంది. బుధవారం జిల్లా వ్యాప్తంగా 34 మండలాల పరిధిలో 24గ్రామ సభలు నిర్వహించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 149 అర్జీలు అందాయన్నారు. వీటిల్లో.. ఇంటి స్థలాలకు 8, అసైన్‌మెంట్ భూములకు సంబంధించి 11, రీసర్వేపై 9, ఆర్‌వోఆర్‌పై 81, ఇతర విషయాలకు భూసమస్యలపై 35 వచ్చాయని వివరించారు. జిల్లా వ్యాప్తంగా తొలిరోజునుంచి ఇప్పటి వరకు 16,459 అర్జీలు అందాయన్నారు.

మున్సిపల్ కమిషనర్ల సీనియారిటీ జాబితా

అమరావతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పనిచేస్తున్న 22 మంది వర్కింగ్ మున్సిపల్ కమిషనర్ స్పెషల్ గ్రేడ్‌లకు, 49 మంది వర్కింగ్ మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-1 కేడర్‌కు సంబంధించి ప్రభుత్వం సీనియారిటీ జాబితా ప్రకటించింది. అలాగే, 13 మంది గ్రేడ్-2 కేడర్‌కు, 26 మంది గ్రేడ్-3 కేడర్‌కు సీనియారిటీ జాబితా ప్రకటిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు విడుదల చేసింది.

తమిళనాడు సరిహద్దులో ప్రైవేటు బస్సు బోల్తా

- పది మందికి తీవ్రగాయాలు



వి.కోట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఓంశక్తి భక్తులతో వెళుతున్న ప్రైవేటు బస్సు అదుపుతప్పి రోడ్డు బోల్తా పడింది. బుధవారం ఉదయం కర్ణాటక రాష్ట్రం కోలారు నుంచి సుమారు 50 మంది ఓంశక్తి భక్తులతో ప్రైవేటు బస్సు మేల్‌మరవత్తూరుకు బయల్దేరింది. ఆంధ్రా - తమిళనాడు సరిహద్దులో బత్తరపల్లె సమీపంలో ఉదయం 11 గంటల సమయంలో నాయకనేరి దాటి తమిళనాడు పరిధిలోకి ప్రవేశించింది. పేర్నాంబట్ ఘాట్‌లోని ప్రమాదకర మలుపుల్లో వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. రోడ్డుపై అడ్డుగా బస్సు ఉండటంతో వాహనాల రాకపోకలకు సుమారు మూడు గంటలపాటు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పేర్నాంబట్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పది మందికి తీవ్రగాయాలు కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం ఉన్నతాస్పత్రికి తరలించారు. బోల్తాపడ్డ బస్సును క్రేన్ సాయంతో పక్కకు తీసి ట్రాఫిక్ పునరుద్ధరించారు. డ్రైవర్ చాకచక్యంతో బస్సును లోయ వైపునకు వెళ్లనీయకుండా నియంత్రించడంతో పెను ప్రమాదం తప్పింది.

ఆటోబోల్తా

ఇద్దరు విద్యార్థులకు గాయాలు





నగరి, జనవరి8(ఆంధ్రజ్యోతి): ఏకాంబరకుప్పం మార్గంలో విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని మలుపు వద్ద బుధవారం ఆటో బోల్తా పడింది. ఏకాంబరకుప్పానికి చెందిన విద్యార్థులు వెట్రి,కనిష్క‌లు తీవ్రంగా గాయపడ్డారు. మరో ఆరుగురు చిన్నారులకు స్వల్ప గాయాలయ్యాయి. మలుపు దగ్గర రోడ్డు సరిగా లేక ఆటో బోల్తా పడిందని సీఐ మహేశ్వర్ తెలిపారు. తీవ్రగాయాలైన చిన్నారులిద్దరికీ స్థానిక ఏరియా వైద్యశాలలో ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం వారిని తిరుపతి రుయాకు తరలించారు. ఎనిమిది మంది విద్యార్థులు రోజు ఈఆటోలో పాఠశాలకు వెళ్తుంటారు.

చికిత్స పొందుతున్న వెట్రి- కనిష్క

తిరుమలకొండయ్యపల్లిలో జల్లికట్టు



పూతలపట్టు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పి.కొత్తకోట పంచాయతి తిరుమలకొండయ్యపల్లిలో బుధవారం జల్లికట్టు ఉత్సాహంగా జరిగింది. మండలంలోని చుట్టుప్రక్కల గ్రామాల నుంచి యువకులు తమ పశువులను అలంకరించి తీసుకొచ్చారు. వాటిని నిలువరించేందుకు యువకులు పోటీపడ్డారు. ప్రశాంతంగా వేడుక ముగిసిందని గ్రామస్తులు చెప్పారు.

వ్యాన్ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

పెనుమూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనాలను ప్రైవేటు స్కూల్ వ్యాన్‌ఢీ కొన్న ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా.. తిరుపతిలోని ఓ ప్రైవేటు స్కూల్ వ్యాన్ బుధవారం చిత్తూరు వెళ్లి బుధవారం రాత్రి తిరిగి వస్తోంది. పెనుమూరు సమీపంలోని బీసీకాలనీ మలుపువద్ద ఎదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహన చోదకులిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులు శీను (సోమనందాపురం)ను చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి, విష్ణు (చార్వాగానిపల్లి)ను తిరుపతి తరలించారు.

అన్న క్యాంటీన్లను రోజూ తనిఖీ చేయాలి

చిత్తూరు అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ అధికారులు ఆయా ప్రాంతాల్లోని అన్న క్యాంటీన్లను రోజూ తనిఖీ చేయాలని రాష్ట్ర పురపాలక, పరిపాలన శాఖ డైరెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. బుధవారం ఆయన విజయవాడ నుంచి నగరపాలక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్న క్యాంటీన్లను రోజూ తనిఖీ చేసి ఆహార నాణ్యతపై సంబంధిత ఏజెన్సీలకు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. తనిఖీలు వెళ్లకపోయినా.. మొక్కుబడిగా తనిఖీలు చేసినా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో కమిషనర్ నరసింహ ప్రసాద్, సహాయ కమిషనర్ ప్రసాద్, ఎంఈ వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే మన దేశ భవిష్యత్తు

- ప్రతిభా పురస్కారాల ప్రదాన సభలో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువతే మన దేశ భవిష్యత్తు అని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ తెలిపారు. ఎస్వీయూనివర్సిటీ శ్రీనివాసా ఆడిటోరియంలో బుధవారం ఏపీ స్టూడెంట్ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా హాజరై, ప్రసంగించారు. కష్టాలకు ఎదురీది చదువుకున్నవారే ప్రపంచంలో అత్యద్భుత శక్తులుగా రూపొందారని గుర్తు చేశారు. పాఠ్య పుస్తకాలతోపాటు సమాజం గురించి చదువుకోవాలని సూచించారు. సాంకేతికతను సరిగా వినియోగించుకుంటూ.. పొగ, మద్యం, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలన్నారు. మహాత్మాగాంధీ, అంబేడ్కర్, స్వామి వివేకానంద, అబ్దుల్ కలాం వంటి మహోన్నత మూర్తుల గొప్పదనాన్ని తెలుసుకోవాలని అన్నారు. ఎంత ఎదిగినా నైతిక మార్గాన్ని విడనాడకూడదని కోరారు. ఏపీ స్టూడెంట్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమాద్రి యాదవ్ మాట్లాడుతూ.. ఇంటర్ నుంచి పీజీ దాకా ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రతిభా అవార్డులు ఇచ్చామన్నారు. తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తనయుడు మదన్, టీడీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మబ్బు దేవనారాయణరెడ్డి, కార్పొరేటర్ అన్నా అనిత, ఎస్వీయూ కామర్స్ హెడ్ జయచంద్రారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు తిరుపతి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేయాలన్నారు. సుమారు 250 మందికి అవార్డులు ప్రదానం చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఏపీ స్టూడెంట్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి శ్రీధర్, వర్సిటీ అధ్యక్షుడు ఉపేంద్ర, నాయకులు శ్రీను, నగర అధ్యక్షుడు వెంకటేష్ పాల్గొన్నారు.



విద్యార్థికి ప్రతిభా అవార్డు అందజేస్తున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపేట, బల్ల గ్రామాలకు చెందిన వెంకటమ్మ, గురునాథప్ప బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, జిల్లా కార్యదర్శి జయశంకర్, తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాగభూషణం, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నరసింహులు, నేతలు నారాయణస్వామి, మునిరత్నం, ఎర్రప్ప, శంకర్ తదితరులు మృతులకు ఘనంగా నివాళులర్పించారు. మృతుల కుటుంబాలను పరామర్శించి కుటుంబ సభ్యులకు పార్టీ తరపున రూ.10 వేలు చొప్పున ఆర్థికసాయం అందజేశారు.

రెవెన్యూ సదస్సుల్లో 570 అర్జీలు

సోమల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులు బుధవారంతో ముగిశాయని.. వివిధ సమస్యలపై 570 అర్జీలు అందినట్లు తహసీల్దారు బెన్నురాజ్ తెలిపారు. ఆవులపల్లె, అన్నెమ్మగారిపల్లె పంచాయతీల్లో 22ఏ నిబంధనలు తొలగించాలని అధికంగా వినతులు అందినట్లు పేర్కొన్నారు. దారి సమస్యలపై వినతులు అందగానే క్షేత్రస్థాయి సందర్శించి సర్వే చేసి పరిష్కరించామని తెలిపారు. శ్మశాన వాటికలకు దారి ఆక్రమణపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకుని అర్హులకు న్యాయం చేస్తామని వివరించారు.

జాతీయ స్థాయి పోటీలకు నిఖిత ఎంపిక



విద్యార్థినికి ప్రోత్సాహక నగదు అందిస్తున్న పూర్వవిద్యార్థులు

సోమల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నంజంపేట హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థిని నిఖిత జాతీయ స్థాయి డిస్కస్ త్రోబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం కుసుమాంబ తెలిపారు. ఈనేపథ్యంలో పూర్వ విద్యార్థులు అభినందించి రూ.6 వేలు నగదు ప్రోత్సాహక బహుమతి అందజేశారు. అలాగే పూర్వ విద్యార్థి అనూబేగ్ మరో రూ 2 వేలు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఎస్ఎంసీ ఛైర్మన్ ఇమ్మాన్, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు



పదో తరగతి విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఎంఈవో శివరత్న

సోమల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు ఇష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయని.. వందశాతం ఉత్తీర్ణులు కావాలని ఎంఈవో శివరత్న కోరారు. బుధవారం కందూరు హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. టీవీలు, సెల్‌ఫోన్లను దూరం పెట్టాలన్నారు. ప్రణాళికతో చదవాలని, ఉపాధ్యాయుల సూచనలు తప్పక పాటించాలని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి ఇంటి వద్ద పిల్లలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు వెంకటరమణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు పవన్ చిత్రపటాలు



తహసీల్దారుతో మాట్లాడుతున్న జనసేన నాయకులు

సోమల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సోమలలోని ప్రభుత్వ కార్యాలయాలకు బుధవారం పుంగనూరు నియోజకవర్గం కన్వీనర్ చిన్నారాయల్ ఆధ్వర్యంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాన్ చిత్రపటాలను అందించారు. అధికారులను కలిసి సమస్యలపై కార్యాలయాలకు వచ్చే ప్రజలకు సహకరించాలని.. ప్రభుత్వ పథకాలు పేదలకు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట సోమల జనసేన అధ్యక్షుడు నాగభూషణం రాయల్, డాక్టర్ హరినారాయణ, రామకృష్ణ, రఘు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పింఛన్ల తొలగింపునకు సర్వే



పింఛన్ల సర్వేలో అధికారులు

సోమల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం కందూరులో బుధవారం వైద్యాధికారులు, సచివాలయ ఉద్యోగులు పింఛన్లపై తనిఖీలు చేపట్టారు. రూ.15 వేలు పింఛన్ల పొందుతున్న వారి ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించి రికార్డులను పరిశీలించారు. అనర్హుల వివరాలను గోప్యంగా ఉంచి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో నారాయణ, కార్యదర్శి జయశంకర్, వైద్యబృందం పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఇంటర్ విద్యార్థి మృతి



మృతుడు మనోజ్

సదుం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఇంటర్ మొదటి ఏడాది సీఈసీ చదువుతున్న మనోజ్ బుధవారం అకాల మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. సదుం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుకుంటున్న మనోజ్ గత కొంత కాలంగా అనారోగ్యం బారిన పడ్డాడు. వైద్యం పొందుతూ ఇంటి వద్ద మృతి చెందినట్లు తెలిపారు. మనోజ్ మృతికి విద్యార్థులు, కళాశాల సిబ్బంది మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు.

అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దారు హనుమంతు

చౌడేపల్లె, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఫ్రీహోల్డ్ పనులు వేగవంతం చేయాలని.. అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దారు హనుమంతు రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వీఆర్‌వో, ఆర్ఐలతో ఆయన సమీక్షించారు. మండలంలో 6 వేల ఎకరాల్లో ఫ్రీహోల్డ్ భూములుండగా 300 ఎకరాలకు మాత్రమే రికార్డుల సిద్ధం కావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది గ్రామస్థాయిలో పర్యటించి ఫ్రీ హోల్డ్ భూములున్న రైతుల వివరాలు క్షేత్రస్థాయిలో గుర్తించి అనర్హులను తొలగించాలన్నారు. అర్హులందరికీ లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఐ భారతి, వీఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

కులగణనలో పొరబాట్లు సరిదిద్దాలి



కల్లూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహిస్తున్న కులగణన సర్వేలోని తప్పులను వెంటనే సరిదిద్దాలని తహసీల్దార్ జయసింహకు బుధవారం ఎమ్మార్పీఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మురళి, నరసింహులు, రవి, ప్రభాకర్, దామోదర్, మనోహర్, రమేష్, మల్లికార్జున, వినాయక, సుధాకర్, కోదండరామయ్య, గంగులయ్య, రవిబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న ఎంఈవోలు కేశవరెడ్డి, తిరుమలమ్మ

చౌడేపల్లె, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఎంఈవోలు కేశవరెడ్డి, తిరుమల్మ పంపిణీ చేశారు. బుధవారం స్థానిక హైస్కూల్‌లో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూటీఎఫ్ ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సంఘం సహకారంతో మండలంలోని 400 మంది పదో తరగతి విద్యార్థులకు పంపిణీ తెలిపారు. ఎంపీడీవో లీలామాధవి, హెచ్ఎం నాగరాజరెడ్డి, యూటీఎఫ్ నాయకులు సహదేవయ్య, లోకనాథ్‌రెడ్డి, సుధాకర్, జగన్మోహన్‌రెడ్డి, ఈశ్వరయ్య, శంకరయ్య, మురళీ, బాబురమేష్ పాల్గొన్నారు.

10న రాజనాలబండలో వైకుంఠ ఏకాదశి

చౌడేపల్లె, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండలో టీటీడీ ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈనెల 10న లక్ష్మీనరసింహస్వామి, ఆంజనేయస్వామికి అభిషేకాలు నిర్వహించి ఉదయం 6 నుంచి 8 గంటల వరకు స్వామివారి దర్శనం కల్పించనున్నట్లుపేర్కొన్నారు. పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదిన వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.

కులగణన గడువు 12 వరకు పొడిగింపు

సోమల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ఎస్సీ కులగణన పై నిర్వహిస్తున్న అభ్యంతరాల స్వీకరణ గడువును ఈనెల 12 వరకు పొడిగించినట్లు తహసీల్దారు బెన్నురాజ్ తెలిపారు. 12వ తేదీ వరకు కులగణనపై నిర్దేశిత ప్రాంతాల్లో సంబంధిత అధికారులు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారన్నారు. స్వీకరించిన అభ్యంతరాలను ఆన్‌లైన్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 20న సచివాలయాల నోటీసు బోర్డుల్లో ప్రచురించనున్నట్లు తెలిపారు.

వృద్ధులకు అందని రేషన్ బియ్యం

సోమల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): చిన్నఉప్పరపల్లె పంచాయతీలోని రెండు చౌకదుకాణాల పరిధిలో 40 మంది వృద్ధులకు నిత్యావసర వస్తువులు అందలేదని స్థానికులు తెలిపారు. చిన్నఉప్పరపల్లె పంచాయతీ వీఆర్వో శివయ్య మూడు నెలల క్రితం పాటూరు పంచాయతీకి బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఇక్కడ వీఆర్వో నియామకం జరగలేదు. ఈక్రమంలో మూడు నెలలుగా రేషన్ బియ్యం తీసుకునే పలువురు వృద్ధులకు బయోమెట్రిక్‌లో వేలిముద్రలు పనిచేయక పోవడంలో వారికి బియ్యం అందలేదు. బుధవారం తహసీల్దారు బెన్నురాజ్‌ను వివరణ కోరగా సమస్య తన దృష్టికి రాలేదని, చిన్నఉప్పరపల్లెకు నూతన వీఆర్వోగా బాదుల్లాను నియమించామని.. సమస్యను వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రోత్సాహకాలు



ఆర్టీసీ ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న డిపో మేనేజర్ సుధాకరయ్య

పుంగనూరు రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీకి ఆదాయాన్ని సమకూర్చే ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నట్లు పుంగనూరు డిపో మేనేజర్ సుధాకరయ్య తెలిపారు. బుధవారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో సంస్థకు ఆదాయాన్ని చేకూర్చిన ఉద్యోగులు జీఎం.బాషా, కె.అన్వర్, సి.రెడ్డెప్ప, బి.దామోదర్‌లకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థకు ఆదాయ వనరులను సమకూర్చడానికి శ్రమిస్తున్న ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు సంధ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరికి గాయాలు

పుంగనూరు రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు-రాయలపేట మార్గంలోని నల్లగుట్లపల్లె వద్ద బుధవారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పీలేరు సమీపంలోని మేడికుర్తికి చెందిన నాగరాజ కుమారుడు గురుమూర్తి(35) కొంత కాలంగా పుంగనూరు మండలం పెద్ద అలసాపురంలో కాపురం ఉన్నాడు. బుధవారం సాయంత్రం సొంత పనులపై పుంగనూరుకు ద్విచక్రవాహనంలో వస్తుండగా నల్లగుట్లపల్లె వద్ద మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ప్రమాదంలో గురుమూర్తి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గాయపడిన గురుమూర్తిని పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి ఆందోళనగా ఉందని డాక్టర్ల సూచనల మేరకు మదనపల్లెకు తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

గుడిసిబండకు తీరిన దాహార్తి



గుడిసిబండ వద్ద డ్రిల్ చేస్తున్న బోరు

పుంగనూరు రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం గుడిసిబండ గ్రామానికి తాగునీటి సమస్య బుధవారంతో తీరినట్లు గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. గత 7 ఏళ్లుగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోలేదన్నారు.ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తాగునీటి సమస్యను పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన జిల్లా అధికారులతో మాట్లాడి బోరు వేయించడంతో మంచినీరు పుష్కలంగా వస్తున్నట్లు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

తీర్థంలో ఉచిత కంటి వైద్యసేవలు



బైరెడ్డిపల్లె, జనవరి 8 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని తీర్థం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో బుధవారం కోలార్ జాలప్ప ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటివైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ రచన 14 మందికి కంటిపరీక్షలు నిర్వహించి ఒకరిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. కంటి సమస్యలకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి అరుణ్‌కుమార్, ఆరోగ్య విద్యాధికారి కాంతమ్మ, సూపర్‌వైజర్ శ్రీదేవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తప్పుడు పత్రాలతో ఆలయ భూమిపై కుట్ర



కమలాకర్, ఈవో

పుంగనూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు పాతబస్టాండు సమీపంలోని భోగనంజుండేశ్వర స్వామి దేవాలయ ఆస్తిని కాజేసేందుకు కొందరు కుట్రపన్ని తప్పుడు పత్రాలు సృష్టించినట్లు గ్రూప్ టెంపుల్స్ ఈవో కె.కమలాకర్ స్పష్టం చేశారు. బుధవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆలయానికి చెందిన సర్వే నెంబరు 115/13లోని 0.22 సెంట్లు విలువైన ఆస్తిని పుంగనూరుకు చెందిన కె.సద్దాంహుస్సేన్, కె.సాదిక్ హుస్సేన్‌లు కాజేసేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. రెవెన్యూ రికార్డులు ఎఫ్ఎంబీ, ఎస్ఎల్ఆర్, 1బీ, అడంగల్‌లో 115/13లోని 0.22 సెంట్లు దేవాలయానికి చెందిన భూమిగా నమోదైనట్లు వివరించారు. 115/12లో సుమారు 202 చదరపు గజాలుగా తప్పుడు చెక్‌బందీలతో పత్రాలు సృష్టించి మున్సిపాలిటీకి తప్పుడు సమాచారంతో దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. ఆలయ భూమి అక్రమంగా పొందే ప్రయత్నాలను అడ్డుకోవడంతో వారు హైకోర్టులో కేసు వేయగా కోర్టు కె.సద్దాంహుస్సేన్, కె.సాదిక్ హుస్సేన్‌ల సమక్షంలో సర్వే చేయించాలని ఆదేశించినట్లు తెలిపారు. మండల సర్వేయర్, ఈవో, మున్సిపల్ అధికారులు, కేసు వేసిన కె.సద్దాంహుస్సేన్, కె.సాదిక్ హుస్సేన్‌ల సమక్షంలో గతనెల 16వ తేదీన సర్వే చేసి 115/13లోని 0.22 సెంట్లు ఆలయ భూమిగా నిర్ధారించారని వివరించారు. సర్వే నెంబరు 115/12లోని 0.93 సెంట్లు వ్యక్తుల ఆస్తులు, భవనాలుగా సర్వే రిపోర్టు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ఆలయ నిర్మాణాలు అడ్డుకున్న మున్సిపల్ అధికారులు

పట్టణంలోని భోగనజుండేశ్వరస్వామి ఆలయం వద్ద అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నట్లు కొంతమంది మున్సిపల్ కమిషనర్ కేవీ.మధుసూదన్‌రెడ్డి దృష్టికి బుధవారం తీసుకెళ్లడంతో ఆయన అధికారులతో అడ్డుకున్నారు. 115/3లోని 0.22 సెంట్లు ఆలయ స్థలం కోర్టు పరిధిలో ఉందని, పనులు నిలుపుదల చేయాలని టౌన్‌ప్లానింగ్ అధికారి జగదీశ్వరరెడ్డితో కలిసి నిర్మాణ స్థలం వద్ద చేరుకుని పనులు ఆపించారు. మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి మున్సిపల్ కార్మికులను పిలిపించి అక్రమ కట్టడాలను తొలగించే ప్రయత్నం చేశారు. దీంతో ఆలయ సిబ్బంది భూ రికార్డులు, సర్వే రిపోర్టును చూపించడంతో కోర్టులో ఉండటంతో పనులను కొంతకాలం నిలుపుదల చేయాలని కమిషనర్ సూచించారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



అవార్డు గ్రహీత మంజువాణిని సన్మానిస్తున్న ఎంఈవోలు

కల్లూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కావేటిగారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం మంజువాణికి ఈనెల 3న సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా తిరుపతిలో ఉత్తమ మహిళా ఉపాధ్యాయురాలుగా అవార్డు అందజేశారు. దీంతో పులిచెర్ల ఎంఈవోలు శిద్దరామయ్య, పోకల తాతయ్య ఆధ్వర్యంలో ఎంఈవో కార్యాలయంలో బుధవారం ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయురాలుగా మంజువాణి అవార్డు అందుకోవడం మండలానికి గర్వకారణమన్నారు. ఉత్తమ సేవలతోనే అవార్డులు, సన్మానాలు సాధ్యమవుతాయన్నారు. అవార్డు గ్రహీత మంజువాణి అడుగుజాడల్లో అందరు ఉపాధ్యాయులు నడవాలని తెలిపారు. అనంతరం ఆమెను పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో ఎల్లంకివారిపల్లి విద్యార్థి ప్రతిభ



ఉపాధ్యాయురాలు ఉషారాణి నుంచి జ్ఞాపిక అందుకుంటున్న విద్యార్థి ఆకాష్

కల్లూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో బుధవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ఎల్లంకివారిపల్లి విద్యార్థి ఆర్ ఆకాష్ ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల హెచ్ఎం హరిశంకర్ తెలిపారు. ఎల్లంకివారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి ఆకాష్ విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. విజయవాడలో విద్యార్థి ఆకాష్ స్మార్ట్ హౌస్ అనే ప్రయోగాన్ని ప్రదర్శించి మెమెంటో, ప్రశంసాపత్రం అందుకున్నాడు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థి ఆకాష్ ఈనెల 20వ తేదీన పాండిచ్చేరిలో నిర్వహిస్తున్న సదరన్ లెవల్ వైజ్ఞానిక ప్రదర్శన పోటీలకు ఎంపికవడంతో పోటీలో పాల్గొననున్నారు. దీంతో విద్యార్థి ఆకాష్‌ను ఎంఈవోలు శిద్దరామయ్య, పోకల తాతయ్య, గైడ్ టీచర్ ఉషారాణి అభినందించారు.

బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో సుధారాణి

బైరెడ్డిపల్లె, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం డీఎంహెచ్‌వో సుధారాణి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి ఆరోగ్య సంరక్షణ గురించి ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధికారి శ్రీవాణి, యూడీసీ గిరి శ్రీనివాస్, వైద్యాధికారి విజయచందర్, సీహెచ్‌వో అనురాధ, ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పుంగనూరు రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో 1974-1975లో ఇంటర్మీడియట్ చదివిన విద్యార్థులంతా కలిసి సందడి చేస్తూ గత జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. బుధవారం పుంగనూరు బసవరాజ ప్రభుత్వ కాలేజీలో చదువుకుని 50 ఏళ్ల తర్వాత కలవడంతో ఒకరికొకరు పలకరించుకొని ఆనందాన్ని పంచుకున్నారు. విద్యార్థి దశలో చేసిన చిలిపి చేష్టలు, అల్లర్లను గుర్తు చేసుకుని తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తెలంగాణ, కర్ణాటక, ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన తర్వాత మళ్లీ కలవడంతో వారి ఆనందాలకు హద్దులు లేకుండా పోయాయి.

10న శ్రీశైలంలో మల్లికార్జునస్వామికి మహాపుష్పాభిషేకం

పుంగనూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామికి వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఈనెల 10న సాయంత్రం అత్యంత వైభవంగా మహాపుష్పాభిషేకం జరుగుతుందని బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 15 ఏళ్ల తర్వాత శ్రీశైలంలో మల్లికార్జునస్వామికి 30 రకాలైన 4 వేల కిలోల పూలతో మహాపుష్పాభిషేకం నిర్వహిస్తున్నట్లు వివరించారు. వైకుంఠ ఏకాదశి రోజున శక్తిపీఠం, జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలంలో మహాపుష్పాభిషేక కార్యక్రమం జరుగుతుందని, భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ దాడి అమానుషం

పుంగనూరు రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీజేపీ కార్యాలయంపై దాడి చేయడం అమానుషమని బీజేపీ రాష్ట్ర మైనారిటీ మోర్చా నాయకుడు పి.అయూబ్ ఖాన్ ఖండించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారంలో ఉన్నామనే ప్రతిపక్ష పార్టీ కార్యాలయాలపై దాడులు చేయడం అప్రజాస్వామికమన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ గురించి ఉపన్యాసాలు ఇవ్వడం కాదని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని హితవుపలికారు. ఢిల్లీ వీధుల్లో మూడు వేలమంది సిక్కుల్ని ఊచకోత కోసిన పార్టీ కాంగ్రెస్ అని గుర్తు చేశారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ నాయకులపై ఎదురు దాడికి దిగితే రోడ్లపై తిరగలేరని హెచ్చరించారు.

ముగిసిన పుంగనూరు జోనల్ అథ్లెటిక్స్



షాట్‌పుట్‌లో విజేతలుగా నిలిచిన నాయుడు, నితీష్, సుహేబ్

చౌడేపల్లె, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా జరుగుతున్న పుంగనూరు జోనల్ అథ్లెటిక్స్ క్రీడలు బుధవారంతో ముగిశాయి. మండలంలోని పుదిపట్ల హైస్కూల్‌లో నియోజకవర్గ స్థాయి జోనల్ అథ్లెటిక్స్ క్రీడలు హోరా హోరీగా జరిగాయి. ఈ పోటీలలో 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో చౌడేపల్లె హైస్కూల్‌కు చెందిన శివ జావిలిన్‌త్రోలో మొదటి స్థానం సాధించారు. అలాగే షాట్‌పుట్‌లో సదుం హైస్కూల్‌కు చెందిన విద్యార్థి నాయుడు మొదటి స్థానం, చౌడేపల్లెకు చెందిన నితీష్ ద్వితీయస్థానం, సుహేబ్ మూడోస్థానం సాధించారు. కార్యక్రమంలో పీడీ వెంకటేష్, రాజేంద్ర, హెచ్ఎం పద్మజ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.2.50 లక్షల విరాళం



ఐరాల(కాణిపాకం), జనవరి 8(ఆంధ్రజ్యోతి): వరసిద్ధుని ఆలయ అభివృద్ధికి రేణిగుంటకు చెందిన దాసరి రామ్‌ప్రసాద్ రూ.2,50,000 అందజేశారు. ఆలయంలో బుధవారం ఈ సందర్భంగా దాతను సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు,జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ద్రావిడ వర్సిటీ వీసీ ఎంపికకు సెర్చ్ కమిటీ

కుప్పం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్న ఉపకులపతి (వీసీ) ఎంపికకోసం ప్రభుత్వం ముగ్గురు సభ్యులతో కూడిన సెర్చ్ కమిటీని నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ నామినీ ఎన్ఐపీఆర్ గౌహతి డైరెక్టర్ యూఎస్ఎన్.మూర్తి, ఏపీఎస్‌సీహెచ్ఈ మాజీ వీసీ పి.నరసింహారావు, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నామినీ న్యూఢిల్లీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లివర్ అండ్ బైలరీ సైన్సెస్ ఎస్‌కే.షరీన్‌లు ఇందులో సభ్యులుగా ఉన్నారు. సాధ్యమైనంత త్వరలో సమావేశాన్ని ఏర్పాటుచేసి మూడు పేర్లతో కూడిన ప్యానెల్‌ను ప్రభుత్వానికి సమర్పించాలని సెర్చ్ కమిటీకి సూచించింది. సెర్చ్ కమిటీకి టీఏ, డీఏ, ఇతర వ్యయాలను ద్రావిడ విశ్వవిద్యాలయం నిధులనుంచి చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నాలో టీడీపీ మైనారిటీ నాయకులు సుహేల్‌బాషా, తదితరులు

పుంగనూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తీరుకు నిరసనగా టీడీపీ మైనారిటీ నాయకుడు సయ్యద్ సుహేల్‌బాషా ఆధ్వర్యంలో ధర్నా చేశారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి కమిషనర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సుహేల్ బాషా మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్య పనులు సక్రమంగా చేయడం లేదని, కాలువల్లో నిల్వ ఉన్న పూడిక మట్టిని తొలగించాలని.. కమిషనర్‌ను అడిగితే సక్రమంగా సమాధానం ఇవ్వడంలేదన్నారు. ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో కమిషనర్ తనపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు ఆరోపించారు. సమస్యలపై మాట్లాడేందుకు ఎవరని బెదిరించారని వాపోయారు. మున్సిపల్ కార్యాలయం వైసీపీకి అడ్డాగా మారిందని.. వైసీపీ నేతలు మీటింగ్‌లు, బర్త్‌డేలు జరుపుకున్నా కమిషనర్ పట్టించుకోవడంలేదని ఆరోపించారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఇచ్చిన లేఖలను ఆయన పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. పుంగనూరు కమిషనర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సద్దాంహుసేన్, ఇమ్రాన్, ప్రవేజ్, అస్లామ్, నూర్ తదితరులు పాల్గొన్నారు. ఈ విషయంపై కమిషనర్ మధుసూదన్‌రెడ్డిని వివరణ కోరగా పట్టణంలో శానిటేషన్ పనులు చేపడుతున్నామని.. చేసినట్లు ఫోటోలు ఉన్నాయని, సుహేల్‌బాషా చెప్పిన కాలువ పూడికతీత పని పూర్తయ్యాయని.. తనకు టీడీపీ ఇన్‌చార్జి నుంచి ఎలాంటి లేఖ ఇవ్వలేదని చెప్పారు. ఎవరినీ అమర్యాదగా మాట్లాడలేదని, అన్నింటిలో ఆయన జోక్యం చేసుకుని ప్రశ్నిస్తుండటంతో అన్ని పనులు చేస్తున్నా ఎందుకు ఇలా వ్యవహరిస్తున్నారని... బదిలీ చేయిస్తే వేరేచోటికి వెళతానని చెప్పానని తెలిపారు.

చికిత్స పొందుతున్న 34మంది

ఈ ఘటనలో మొత్తం 40 మంది గాయపడినట్టు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. వీరిలో రుయాస్పత్రికి 28మందిని తరలించగా నలుగురు మృతి చెందారని, స్విమ్స్‌కు 12 మంది తరలించగా ఇద్దరు మృతి చెందినట్టు చెప్పారు. బుధవారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడారు. మృతిచెందిన ఆరుగురులో ఐదుమంది మహిళలు ఉండగా ఒకరు మాత్రమే పురుషుడు అని చెప్పారు. మిగిలిన వారు చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

రుయా, స్విమ్స్‌కు క్యూ కట్టిన అంబులెన్సులు

మృత్యువాత పడడంతో పాటు 20 మందికిపైగా అస్వస్థత, గాయాల పాలయ్యారు. చికిత్స నిమిత్తం ఎస్వీఆర్ రుయా, స్విమ్స్ ఆస్పత్రికి తరలించడంతో ఆస్పత్రిలో ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. ఒకదాని వెంట మరొకటి అంబులెన్స్‌లు ఆస్పత్రుల వద్దకు క్యూ కట్టడంతో భక్తుల బంధువులు, ఆస్పత్రి సిబ్బంది, మీడియా ప్రతినిధులు అంబులెన్స్ వైపు పరుగులు తీశారు. కాళ్లు విరిగి గాయపడ్డ భక్తుల ఆర్తనాదాలు కలిచివేశాయి. చికిత్సపొందుతున్నవారిని టీటీడీ ఈవో శ్యామలరావు, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, మున్సిపల్ కమిషనర్ మౌర్య, ఆర్డీవో రామ్మోహన్‌లతో పాటు పోలీసు అధికారులు పరామర్శించి, నాణ్యమైన వైద్యం అందేలా చూడాలని వైద్యాధికారులను కోరారు. అదేవిధంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులతో పాటు ఇతర రాజకీయ పార్టీ నాయకులు బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

రుయాలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

మునిరెడ్డి (35), ఈశ్వరమ్మ (36), పార్వతి (52), ఎం.రజిని (40), నాగరాజు (46), శోభారాణి (37), సుబ్బాచారి (63), అంబలాష్ (40), సాంబశివ (69), సావిత్రమ్మ (65), లక్ష్మీదేవి (30), కళావతి (34), అప్పల కొండ (55), నరేంద్ర (40), జయభారతి (47), షాముల్ రాజు (45), ఆదిలక్ష్మి (62), సూర్యకమల (45), రాజేశ్వరి (52), ఎం.రత్నమ్మ (50), నూకా రత్నమ్మ (50), మల్లయ్య (42), పెద్దిరాజు (52), రమణమ్మ (48), శ్రీరామప్ప (70), సునీత (44), గౌరి (40), విజయలక్ష్మి (40), క్రిష్ణమ్మ (60), సూర్య (37), రమాదేవి (52). వీరిలో నలుగురు పాలిట్రామాతో చికిత్స పొందుతున్నారు. వీళ్ల పరిస్థితి కాస్త ఆందోళనకరంగా ఉంది. ప్రాణాపాయం లేదని వైద్యులు అంటున్నారు. రాత్రి రుయా వద్దకు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి చేరుకుని బాధితులతో మాట్లాడారు. కాగా, 1.25 గంటలకు బాధితులు, వారి బంధువులకు ఆస్పత్రుల వద్దకు టీటీడీ అన్నప్రసాదాలు పంపింది.

భక్తులు పెద్ద ఎత్తున రావడంతోనే..

వైకుంఠ ద్వార దర్శనానికి గురువారం ఉదయం 5గంటలకు జారీచేసే టోకన్ల కోసం భక్తులు పెద్ద ఎత్తున ఎగబడడంతో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటన దురదృష్టకరం. మృతి చెందిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుంది. ఘటనకు సంబంధించి వివరాలను ఎస్పీ ద్వారా తెలుసుకున్నా. రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భక్తులను పరామర్శించా, మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను ఆదేశించా.

- ఆరణి శ్రీనివాసులు, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి




క్యూలైన్ వద్ద పిల్లల నిరీక్షణ... సంఘటన తర్వాత టోకెన్లు జారీ చేస్తున్న టీటీడీ సిబ్బంది

అంచనా వేయడంలో అధికారుల విఫలం

తిరుపతిలో ఏర్పాటుచేసిన కేంద్రాల వద్ద జరిగిన తొక్కిసలాటలో భక్తులు ప్రాణాలుకోల్పోవడం బాధాకరం. టోకెన్‌ల జారీచేసే ముందు రోజు నుంచే భక్తులు అధిక సంఖ్యలో చేరుకోవడం, అంచనా వేయడంలో అధికారులు విఫలం చెందడం వల్లే ఈ విషాదం చోటుచేసుకుంది. ఏర్పాట్లు బాగా చేసినప్పటికీ ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. మృతుల కుటుంబాలకు బీజేపీ తీవ్ర సంతాపం ప్రకటిస్తోంది.

- సామంచి శ్రీనివాస్, బీజేపీ అధికార ప్రతినిధి







రుయాస్పత్రిలో..




యాదమరి మండలంలో కేంద్ర బృందానికి వేరుశనగ తీగలను చూపెడుతున్న రైతు చిట్టిబాబు - కేంద్ర బృందానికి వినతిపత్రం అందిస్తున్న టీడీపీ గుడిపాల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు తదితరులు

కరువు పరిస్థితులపై కేంద్ర బృందం పరిశీలన

యాదమరి, గుడిపాల మండలాల్లో సందర్శన ● పంటలను పరిశీలించి, రైతులతో ముఖాముఖి

యాదమరి/గుడిపాల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కరువు పరిస్థితుల పరిశీలనకు కేంద్ర బృందం బుధవారం యాదమరి, గుడిపాల మండలాల్లో పర్యటించింది. పంటలను పరిశీలించి, రైతులతో ముఖాముఖి సమావేశమైంది. కేంద్ర బృందం సభ్యులు ప్రదీప్ కుమార్, దీపాం కొసేథ్, మనోజ్ ఉపాధ్యాయలు జిల్లా అధికార యంత్రాంగంతో కలిసి యాదమరి మండలంలోని కోణాపల్లె రైతుసేవా కేంద్రం పరిధిలో పర్యటించారు. ఎకరా వేరుశనగ సాగుకు రూ.20వేలు ఖర్చవగా, మూడు బస్తాల పంట దిగుబడి చేతికి వచ్చిందని చిట్టిబాబు అనే రైతు తెలియజేశారు. అలాగే తంగమణికి చెందిన కంది పంట నష్టాన్ని పరిశీలించారు. పశుసంవర్ధక, జలవనరుల శాఖ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ పరిశీలించారు. రైతులతో ముఖాముఖి నిర్వహించారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఉచితంగా విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయాలని, పశువులకు అవసరమైన దాణా అందజేయాలని రైతులు గిరి, సురేష్ కోరారు.

ప్రత్యామ్నాయ పంటలవైపు మొగ్గుచూపాలి

వర్షాభావ పరిస్థితుల్లో రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగుచేయాలని కేంద్ర బృంద సభ్యుడు ప్రదీప్ కుమార్ సూచించారు. జిల్లాలో 16 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించారన్నారు. అందులో మూడు తీవ్రస్థాయిలో, 13 మధ్యస్థంగా ఉన్నట్లు తెలిపారు. తీవ్ర కరువు మండలాల్లో నష్టం పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. కేంద్ర బృందం పర్యటనలో జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, వ్యవసాయ అధికారులు శోభారాణి, ప్రభాకర్, ఆర్డీవో శ్రీనివాసులు, సీపీవో సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● గుడిపాల మండలంలోని తేనేపల్లెలోనూ కేంద్ర బృందం రైతులతో ముఖాముఖి నిర్వహించింది. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం ఆదుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, సర్పంచులతో కలిసి కేంద్ర బృందానికి ఈ సందర్భంగా వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో శివరాజ్, ఏఈవో మాధవి, ఎస్ఐ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజు అధికారుల టెన్షన్

ముగిసిన చంద్రబాబు పర్యటన




హెలిపాడ్‌లో చంద్రబాబుకు వీడ్కోలు పలుకుతున్న ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు - ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద వినతులు స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి

కుప్పం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు మూడోరోజు పర్యటన అధికారులను టెన్షన్ పెట్టింది. షెడ్యూల్ మేరకు బుధవారం ఉదయమే చంద్రబాబు కుప్పంనుంచి బయలుదేరి వెళ్లాలి. అయితే ఉదయం శాంతిపురం మండలం కడపల్లెవద్ద నిర్మాణంలో ఉన్న స్వగృహాన్ని పరిశీలిస్తారని, మున్సిపాలిటీలో ఆకస్మిక తనిఖీలు చేస్తారని అనధికారిక సమాచారం అందింది. దీంతో అధికారులు మంగళవారం రాత్రికిరాత్రి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించారు. అన్న క్యాంటీన్ లేదా సచివాలయాలను తనిఖీ చేస్తారన్న సమాచారం ఉండడంతో ఆయా సిబ్బందిని అలర్ట్ చేశారు. ఉదయం 11.45 గంటలదాకా కూడా ఇదే టెన్షన్ అధికార వర్గాల్లో కొనసాగింది. అయితే మధ్యాహ్నం ఒంటి గంటకు తాను బస చేసిన ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌నుంచి బయటకు వచ్చిన చంద్రబాబు, ద్రావిడ విశ్వవిద్యాలయం బయల్దేరి వెళ్లారు. అక్కడ సిద్ధంగా ఉన్న హెలికాప్టర్ ఎక్కి బెంగళూరు పయనమయ్యారు. దీంతో అధికార వర్గాలు ఊపిరి పీల్చుకున్నాయి. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, అనంతపురం డీఐజీ హిమోషి, కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, కడా పీడీ వికాస్ మర్మత్, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, టీటీడీ బోర్డు సభ్యుడు శాంతారాం, టీడీపీ కుప్పం మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు చంద్రబాబుకు వీడ్కోలు పలికారు.

పూర్వపు కమిషనర్‌పై ఫిర్యాదుల విచారణ



టౌన్ ప్లానింగ్ ఏసీపీ నాగేంద్ర నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీ విశ్వనాథ్

చిత్తూరు అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక సంస్థ పూర్వపు కమిషనర్ అరుణ హయాంలో అవినీతి, అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై విచారణ ప్రారంభమైంది. పురపాలక శాఖ ఆర్డీ విశ్వనాథ్ ఆధ్వర్యంలోని అధికారుల బృందం బుధవారం నగరపాలక కార్యాలయానికి చేరుకుంది. పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్, మెప్మా, రెవెన్యూ విభాగాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించింది. వివిధ పథకాలు, టెండర్లకు చెల్లించిన బిల్లులపై ఆరా తీశారు. విచారణ మరో నాలుగు రోజుల పాటు జరిగే అవకాశముంది. అరుణ హయాంలో అవినీతి జరిగిందని, రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాలు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దాంతో ప్రభుత్వం విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే

జిల్లా రిజిస్ట్రారుగా వెంకటరమణమూర్తి

చిత్తూరు సెంట్రల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా రిజిస్ట్రార్‌గా వెంకటరమణమూర్తి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తానన్నారు. విజయనగరం జిల్లా గుర్ల మండలానికి చెందిన ఈయన 2023లో గ్రూప్-1కు ఎంపికయ్యారు. తొలుత విశాఖలో వైద్య ఆరోగ్యశాఖలో కార్యదర్శిగా పనిచేశారు. గతేడాది విజయనగరం జిల్లా రిజిస్ట్రార్‌గా పోస్టింగ్ పొంది, శిక్షణలో ఉన్నారు. తాజాగా వెంకటరమణను ప్రభుత్వం చిత్తూరు జిల్లా రిజిస్ట్రారుగా ప్రభుత్వం నియమించింది. జిల్లా రిజిస్ట్రారుగా గ్రూప్1 అధికారి రావడం తొలిసారి.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

చిత్తూరు సెంట్రల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డిసెంబరు 6 నుంచి ప్రతిష్ఠాత్మకంగా మొదలైన రెవెన్యూ సదస్సులు బుధవారంతో ముగిశాయి. భూ వివాదాల పరిష్కార క్రమంలో ప్రభుత్వం గ్రామ, మండలస్థాయిలో రెవెన్యూ సదస్సులను నిర్వహించింది. రైతుల నుంచి సదస్సులకు విశేష స్పందన లభించింది. జిల్లాలో 822 రెవెన్యూ గ్రామాలుండగా, చివరి రోజైన బుధవారం 32 గ్రామాల్లో నిర్వహించారు. ఇప్పటి వరకు 35,165 మంది రైతులు సదస్సుల్లో పాల్గొన్నారు. 10,242 అర్జీలు అందజేశారు.

పులికాదు అది శునకమే



ప్రజలను భయపెట్టిన శునకం

గుడిపాల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గుడిపాల మండలంలోని కిలారపల్లె సమీప అటవీ ప్రాంతంలో బుధవారం ఉదయం కనిపించింది పులి కాదని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎఫ్ఆర్వో థామస్ స్పష్టం చేశారు. అది కుక్క అని పేర్కొన్నారు. గ్రామానికి ఓ వ్యక్తి బుధవారం ఉదయం బహిర్భూమికి వచ్చాడు. కొంతదూరంలో ఓ జంతువును చూసి పులిలా భ్రమించితో భయంతో పరుగులు తీశాడు. ఈ విషయం మండల వ్యాప్తంగా దావానలంలా వ్యాపించడంతో తహసీల్దార్, అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాలించి చివరకు ఒక రకమైన జాతి కుక్కను గుర్తించారు. దాని కళ్లు అచ్చం పులిలా ఉండటంతో ఆ వ్యక్తి భయపడ్డాడని వారు తెలియజేశారు. ఈ కుక్క తమిళనాడు నుంచి దారి తప్పి ఇక్కడకు చేరుకుందని చెప్పడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

గాయపడిన నెమలిని రక్షించిన యువత

అటవీ అధికారులకు అప్పగింత



నెమలిని రక్షించిన యువకులు

బంగారుపాళ్యం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గాయపడిన నెమలిని రక్షించి.. అటవీ అధికారులకు అప్పగించిన వైనమిది. బుధవారం చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి బోడబండ్ల క్రాస్ వద్ద ఓ నెమలి గాయపడి ఎగరలేని స్థితిలో పడి ఉంది. నలగాంపల్లెకు చెందిన గౌతమ్, ప్రభాకర్, జాన్సన్, సూర్య, సంతోష్, బాలు, రోహిత్, దిలీప్ అనే యువకులు ఈ మార్గంలో రన్నింగ్ ప్రాక్టీస్ చేస్తూ నెమలిని గుర్తించారు. స్పందించిన వారు ఆ నెమలికి సపర్యలు చేశారు. తర్వాత భద్రంగా తీసుకెళ్లి బంగారుపాళ్యంలోని అటవీ అధికారులకు అప్పజెప్పారు. అధికారులు ఆ నెమలిని చిత్తూరు పశువైద్యశాలకు తరలించారు.

మోదీకి బ్రహ్మారథం



రోడ్‌షోలో ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అభివాదం



విశాఖపట్నంలో ప్రధాని మోదీ రోడ్‌షో, హాజరైన అశేష జనం

భారీగా తరలివచ్చిన జనం

- రోడ్‌షోలో ప్రజలకు ప్రధాని అభివాదం
- పూలవర్షం కురిపించిన అభిమానులు
- కేరింతలు, చప్పట్లతో మార్మోగిన ఏయూ ప్రాంగణం

ప్రధాని నరేంద్రమోదీ బుధవారం సాయంత్రం విశాఖపట్నంలో నిర్వహించిన రోడ్‌షో, బహిరంగ సభ సూపర్ సక్సెస్ అయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి రాష్ట్రానికి వచ్చిన ప్రధానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దత్‌ఐలాండ్ వద్ద రోడ్‌షో కోసం ప్రత్యేక వాహనం పైకి ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎంలు చేరగానే చప్పట్లు, కేరింతలతో స్వాగతం పలికారు. మహిళాభిమానులు అడుగడుగునా పూల వర్షం కురిపించారు. మరో వైపు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలోని సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. మోదీ ప్రసంగిస్తున్నంత సేపూ చప్పట్లతో ప్రాంగణాన్ని మార్మోగించారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



బహిరంగ సభ వేదికపై మోదీ అభివాదం. చిత్రంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఉన్నారు.



ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అరకు కాఫీని అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఉన్నారు.



వేదికపై ప్రధాని మోదీ, చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్



బహిరంగ సభకు హాజరైన అశేష జనం

కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు


ముగ్గులను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

నగరి, జనవరి8(ఆంధ్రజ్యోతి): స్థానిక డిగ్రీ కళాశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగాకళాశాల ఆవరణలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. 16 గ్రూపులు పాల్గొన్నాయి..న్యాయనిర్ణేతలుగా ఇందిరాప్రియదర్శిని, చినపాపమ్మ, అరుణకుమారి, పంకజం, మహేశ్వరిలు వ్యవహరించారు. ఉత్తమ రంగవల్లికలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్, అధ్యాపకులు రేవతి, ప్రేమ్‌కుమార్, జ్యోతి, శివప్రసాద్, సుహాసినిలు పాల్గొన్నారు.

భీమనగర్‌లో తాగునీటి సమస్య పరిష్కారం

నగరి, జనవరి8(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని భీమనగర్‌వాసుల దాహార్తి సమస్య తీరింది. ఇక్కడి ప్రజలు తాగునీటి సమస్యను ఇటీవల ఎంఎల్‌ఏ భానుప్రకాష్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయన చొరవ తీసుకున్నారు. తుడా అధికారులతో మాట్లాడి రూ4.50 లక్షలు మంజూరు చేయించారు. బుధవారం బోరు వేశారు. నీరు పుష్కలంగా రావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



గుడిపాల,జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంఆర్సీ కార్యాలయంలో బుధవారం ఎంఈవోలు హసన్, గణపతి ఆధ్వర్యంలో యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు సూర్యబాబు,నాగరాజు, పరంధామనాయుడు, చంద్రశేఖర్, లోకనాథం,శ్రీదేవి,రవి, ఎంఆర్.శరవణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టీఏ డైరీ ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు



చిత్తూరు సెంట్రల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): నోబుల్ టీచర్స్ అసోషియేషన్ (ఎన్‌టీఏ) డైరీని ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం కుప్పంలో ఆవిష్కరించారు. ఆవిష్కరణలో ఎన్‌టీఏ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.జయప్రకాష్‌నాయుడు, రామయ్యలు ఉన్నారు. ఉపాధ్యాయ సమస్యలతో పాటు పీఆర్సీ, ఎంటీఎస్ టీచర్ల జీతాలు, హైస్కూల్ ప్లస్ విధానం అమలు తదితర అంశాలపై సీఎంకు వినతి పత్రం సమర్పించారు.

చురుగ్గా సీతారాముల ఆలయ నిర్మాణ పనులు



గంగాధరనెల్లూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): దిగవూరులో కొత్తగా సీతారాముల ఆలయ నిర్మాణపనులు జోరుగా సాగుతోంది. 93 ఏళ్ల క్రితం నాటి ఈ ఆలయ గోడలు దెబ్బతిన్నాయి. కొంతకాలంగా ఉరుస్తోంది. రెండేళ్ళ క్రితం ఆలయ భవనం స్థానంలో కొత్త భవనాన్ని నిర్మించాలని నిర్ణయించారు. అప్పటి ఎమ్మెల్యే నారాయణస్వామిని గ్రామపెద్దలు కలిసి సహకరించాలని కోరారు. ఈనేపథ్యంలో టీటీడీ ద్వారా రూ.8లక్షలు విడుదల చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. గతేడాది మార్చిలో భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. వచ్చే మారిలోపు పనులను పూర్తి చేసి కుంభాభిషేకం నిర్వహించాలని గ్రామస్తులు భావిస్తున్నారు.

తిరుమలకొండయ్యపల్లిలో ఉత్సాహంగా జల్లికట్టు


పశువులను నిలువరిస్తున్న యువకులు

పూతలపట్టు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పి.కొత్తకోట పంచాయతి తిరుమలకొండయ్యపల్లిలో బుధవారం జల్లికట్టు ఉత్సాహంగా జరిగింది. మండలంలోని చుట్టుప్రక్కల గ్రామాల నుంచి యువకులు తమ పశువులను అలంకరించి తీసుకొచ్చారు. వాటిని నిలువరించేందుకు యువకులు పోటీపడ్డారు. ప్రశాంతంగా వేడుక ముగిసిందని గ్రామస్తులు చెప్పారు.

ఆలయ అభివృద్ధికి రూ.2.50 లక్షల విరాళం



ఐరాల(కాణిపాకం),జనవరి 8(ఆంధ్రజ్యోతి): వరసిద్ధుని ఆలయ అభివృద్ధికి రేణిగుంటకు చెందిన దాసరి రామ్‌ప్రసాద్ రూ2,50,000 అందజేశారు. ఆలయంలో బుధవారం ఈ సందర్భంగా దాతను సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు,జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా రమణ

చిత్తూరు సెంట్రల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా చిత్తూరుకు చెందిన జీవీ రమణను రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విజయవాడలో 5నుంచి 8వ తేదీ వరకు జరిగిన యూటీఎఫ్ రాష్ట్ర స్వర్ణోత్సవ విద్యా వైజ్ఞానిక మహాసభల్లో చివరి రోజైన బుధవారం రాష్ట్ర కమిటీలో రమణకు చోటు దక్కింది.

ఆటోబోల్తా ఇద్దరు విద్యార్థులకు గాయాలు


చికిత్స పొందుతున్న వెట్రి- కనిష్క

నగరి, జనవరి8(ఆంధ్రజ్యోతి): ఏకాంబరకుప్పం మార్గంలో విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని మలుపు వద్ద బుధవారం ఆటో బోల్తా పడింది. ఏకాంబరకుప్పానికి చెందిన విద్యార్థులు వెట్రి,కనిష్కలు తీవ్రంగా గాయపడ్డారు. మరో ఆరుగురు చిన్నారులకు స్వల్ప గాయాలయ్యాయి. మలుపు దగ్గర రోడ్డు సరిగాలేక .ఆటో బోల్తా పడిందని సీఐ మహేశ్వర్ తెలిపారు. తీవ్రగాయాలైన చిన్నారులిద్దరికీ స్థానిక ఏరియా వైద్యశాలలో ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం వారిని తిరుపతి రుయాకు తరలించారు. ఎనిమిది మంది విద్యార్థులు రోజు ఈఆటోలో పాఠశాలకు వెళ్తుంటారు.

ఉచిత పశు వైద్యశిబిరం



నింద్ర, జనవరి 8(ఆంధ్రజ్యోతి): నింద్ర పంచాయితీ మిట్ట కండ్రిగలో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. గర్భకోశ వ్యాధులకు సంబంధించి చికిత్స నిర్వహించారు. పశుపోషణపై రైతులకు అవగాహన కల్పించారు. పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలరు. డైరెక్టర్ మునిలక్ష్మిపతి, సాయిసౌందర్య, కొప్పెడు, శివమూర్తి పాల్గొన్నారు.

పాపిరెడ్డిపల్లెకు సచివాలయం మార్చాలి

ప్రత్యేక గ్రామసభలో మెజారిటీ ప్రజల అభిప్రాయం


ప్రత్యేక గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి

గంగాధరనెల్లూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పాపిరెడ్డిపల్లెకు సచివాలయ కార్యాలయం మార్చాలని మెజారిటీ ప్రజలు తమ అభిప్రాయాన్ని విస్పష్టంగా చెప్పారు. సచివాలయ మార్పుపై పాపిరెడ్డిపల్లెలో బుధవారం రెండు పంచాయతీల ప్రజల అభిప్రాయ సేకరణకు ప్రత్యేక గ్రామసభను అధికారులు నిర్వహించారు. పాపిరెడ్డిపల్లె, నందనూరు పంచాయతీలకు చెందిన సుమారు 150మంది హాజరయ్యారు. వారిలో 145 మంది సచివాలయం ఆఫీస్‌ను పాపిరెడ్డిపల్లెకు మార్చాలని కోరుతూ చేతులు ఎత్తి తమ మద్దతును ప్రకటించారు. మిగిలిన ఐదుగురు సచివాలయాన్ని మార్చరాదని వ్యతిరేకిస్తూ చేతులు ఎత్తారు. దీంతో ఎంపీడీవో మాట్లాడుతూ మెజారిటీ ప్రజలు సచివాలయం ఆఫీస్‌ను మార్చాలని కోరిన విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నందనూరు సర్పంచ్ మంజుల, పాపిరెడ్డిపల్లె ఎంపీటీసీ భారతి, పంచాయతీ కార్యదర్శి రజని, పలువురు ప్రజలు, నేతలు పాల్గొన్నారు.

రంగోత్సవ్ విజేతలకు బహుమతుల ప్రదానం


సాంస్కృతిక బృందంతో 'డైట్' ప్రిన్సిపాల్ శేఖర్

వెదురుకుప్పం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యా శిక్షణా సంస్థ(డైట్)లో బుధవారం జిల్లా స్థాయి రంగోత్సవం పోటీలను నిర్వహించారు. పోటీలను డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వివిధ పాఠశాలల నుంచి ఎనిమిది అంశాలపై జరిగిన పోటీల్లో 70 మంది పాల్గొన్నారన్నారు. ఇందులో ప్రథమ బహుమతులు అందుకున్న వారు విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరవుతారన్నారు. ప్రిన్సిపాల్ ప్రథమ బహుమతులను అందజేశారు.

ప్రథమ బహుమతులు పొందిన వారు

రోల్ ప్లే విభాగంలో ఎం.ఐశ్వర్య(పచ్చికాపల్లం జడ్పీ కళాశాల), రంగోలిలో కె.హిమశ్రీ బృందం(కార్వేటినగరం డైట్).డిజిటల్ పోస్టర్‌లో కేఎం ధనశ్రీ(కార్వేటినగరం బాలికల జడ్పీ ఉన్నత పాఠశాల), ఫోక్‌డ్యాన్స్‌లో ఎం.ఉమాదేవి బృందం(కమ్మపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల), డ్రాయింగ్‌లో ఎం.సౌమ్యప్రీతి(కొత్తపల్లి మిట్ట జడ్పీ ఉన్నత పాఠశాల), స్లోగన్‌లో పి.జయశ్రీ(శాంతవేలూరు జడ్పీ ఉన్నత పాఠశాల), హ్యాండ్ రైటింగ్‌లో కేఎం హాసిని(చిత్తూరు జీహెచ్‌ఎస్),క్విజ్ పోటీలో డి.జాన్సీ, కె.నిశిత(శాంతవేలూరు జడ్పీ ఉన్నత పాఠశాల).

రైతుల అర్జీలకు త్వరలో పరిష్కారం


గుడిపాల తహసీల్దారును కోరుతున్న రైతులు

పాలసముద్రం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక సచివాలయంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గత నెల రోజులుగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులు బుధవారంతో ముగిసినట్లు తహసీల్దార్ అరుణకుమారి పేర్కొన్నారు. రైతులు సమర్పించిన అర్జీలను త్వరలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో డీటీ రిషి వర్మ, ఆర్ఐ దేవి, వీఆర్వోలు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గుడిపాల: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికార బలంతో అర్హులకు అన్యాయం చేసి అనర్హులకు భూమి సర్వే నెంబర్లు నమోదు చేశారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని పక్కన పెట్టి పార్టీలకు అతీతంగా న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. గ్రామంలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఈమేరకు తమవాణి వినిపించారు. కాగా గ్రామస్థుల ఫిర్యాదు మేరకు తహసీల్దార్ అరుంధతివాడ వెళ్లి శ్మశాన దారిని పరిశీలించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, టీడీపీ నాయకులు జయచంద్ర, రమేష్‌రెడ్డి,దొరబాబు, నిత్యానందం, చందు, ధనసింగ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్స్‌కు ఇంటిస్థలాలు మంజూరు చేయాలి: సీపీఐ


తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కార్మికులు

నగరి, జనవరి8(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని తమకు ఇంటిస్థలాలు మంజూరు చేయాలని తహశీల్దారు రవికుమార్‌కు శానిటరీ,ఇంజనీరింగు కార్మికులు వినతిపత్రం అందజేశారు. సీపీఐ ఆధ్వర్యంలో నాయకులు వేలన్, మురళి తదితరులు బుధవారం తహసీల్దారును కలిశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి నాగరాజు, నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్యలు మాట్లాడుతూ పట్టణంలో కార్మికులకు 3 సెంట్ల వంతున ఇంటి స్థలం కేటాయించి పక్కాగృహాలు మంజూరు చేయాలని కోరారు. .కార్యక్రమంలో భాషా, విజయ్, రాజేంద్ర, సెల్వి, నాగరాజు, సతీష్ దీప. చినరాజ్, జానకీరామన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాన్ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

పెనుమూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనాలను ప్రైవేటు స్కూల్ వ్యాన్‌ఢీ కొన్న ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా.. తిరుపతిలోని ఓ ప్రైవేటు స్కూల్ వ్యాన్ బుధవారం చిత్తూరు వెళ్లి బుధవారం రాత్రి తిరిగి వస్తోంది. పెనుమూరు సమీపంలోని బీసీకాలనీ మలుపువద్ద ఎదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహన చోదకులిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులు శీను(సోమనందాపురం) ను చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి, విష్ణు(చార్వాగానిపల్లి)ను తిరుపతి తరలించారు.

శ్మశాన భూములను కాపాడాలి


డిప్యూటీ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

శ్రీరంగరాజపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో చొక్కమడుగు స్మశాన భూమిని, చెరువును కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులుతో కలసి టీడీపీ నాయకులు బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ రవీంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. చొక్కమడుగు, ఎన్‌టీఆర్ కాలనీ దళితవాడకు శ్మశానం ఏర్పాటు చేయాలని కోరారు. ఆర్ఐ ప్రభాకర్, నియోజకవర్గం టీడీపీ ఎస్సీ సెల్ కార్యదర్శి ఎన్. కుమార్, రఘునాథరెడ్డి, మారయ్య, వెంకటేష్‌రెడ్డి, దాసు పాల్గొన్నారు.

గోవిందమాల భక్తుల అన్నదానం



నగరి, జనవరి8(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని గోవిందమాల భక్తులు పాదయాత్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం అన్నదానం నిర్వహించారు. స్థానిక కరియ మాణిక్యస్వామి ఆలయం వద్ద బుధవారం వారు పలువురికి అన్నదానం చేశారు. ముడుపు కట్టుకుని పాదయాత్ర ప్రారంభించే ముందురోజు అన్నదానం చేయడం తమ ఆనవాయితీ అని గోవిందమాల భక్తులు చెప్పారు.

బంగారుపాళ్యం: తగ్గువారిపల్లె పంచాయతీలోని ఇందిరమ్మ కాలనీలో బుధవారం ఓంశక్తి భక్తుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తొలుత అమ్మవారి చిత్రపటానికి పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఇరుముడులు సమర్పించడానికి మేల్‌మరమత్తూరుకు బయలుదేరారు.

ప్రణాళికాబద్ధంగా బోధన

వెదురుకుప్పం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఇంటర్మీడియట్ విద్యార్థులను ప్రణాళికాబద్ధంగా చదివిస్తున్నామని కార్వేటినగరం మండలం ఆర్కేఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.స్వరూప తెలిపారు. బుధవారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం జరిగింది.

అన్న క్యాంటీన్లను రోజూ తనిఖీ చేయాలి

చిత్తూరు అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ అధికారులు ఆయా ప్రాంతాల్లోని అన్న క్యాంటీన్లను రోజూ తనిఖీ చేయాలని రాష్ట్ర పురపాలక, పరిపాలన శాఖ డైరెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. బుధవారం ఆయన విజయవాడ నుంచి నగరపాలక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్న క్యాంటీన్లను రోజూ తనిఖీ చేసి ఆహార నాణ్యతపై సంబంధిత ఏజెన్సీలకు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. తనిఖీలు వెళ్లకపోయినా.. మొక్కుబడిగా తనిఖీలు చేసినా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో కమిషనర్ నరసింహ ప్రసాద్, సహాయ కమిషనర్ ప్రసాద్, ఎంఈ వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు నిఖిత ఎంపిక


ప్రోత్సాహక నగదు అందిస్తున్న పూర్వవిద్యార్థులు

సోమల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నంజంపేట హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థిని నిఖిత జాతీయ స్థాయి డిస్కస్ త్రోబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం కుసుమాంబ తెలిపారు. ఈనేపథ్యంలో పూర్వ విద్యార్థులు అభినందించి రూ.6 వేలు నగదు ప్రోత్సాహక బహుమతి అందజేశారు. పూర్వ విద్యార్థి అనూబేగ్ మరో రూ. 2 వేలు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఎస్ఎంసీ చైర్మన్ ఇమ్మాన్, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో విద్యార్థి మృతి

సదుం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఇంటర్ మొదటి సంవత్సర విద్యార్థి మనోజ్ అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. సదుం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకుంటున్న మనోజ్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో వైద్యం పొందుతూ ఇంటి వద్ద మృతి చెందాడు.

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలపై అవగాహన కల్పించాలి



రికార్డులను పరిశీలిస్తున్న వైద్యాధికారి వెంకటప్రసాద్

తవణంపల్లె, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రిలో సురక్షిత ప్రసవం చేసుకొనేలా అవగాహన కల్పించాలని జిల్లా అదనపు వైద్యాధికారి వెంకటప్రసాద్ సిబ్బందికి సూచించారు. తవణంపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా హై రిస్క్ గర్భిణులను గుర్తించి తగిన సలహాలు, సూచనలు చేసి రక్త హీనత లేకుండా గర్భిణులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది, గర్భిణులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ దగ్గుమళ్ళ జన్మదిన వేడుకలు

చిత్తూరు సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఎంపి దగ్గుమళ్ళ ప్రసారావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా పార్టీ కార్యవర్గ కమిటి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు జన్మదినం సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపే కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. అనంతరం ఎమ్మెస్సార్ సర్కిల్ వద్ద అన్నదానం చేస్తారని తెలిపారు. కార్యక్రమానికి పార్టీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ తదితరులు హాజరవుతారని, పార్టీ నేతలు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ ప్రకటనలో తెలిపారు.

రోడ్డు మరమ్మతులకు చొరవ చూపిన స్నేహితులు



రోడ్డు మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్న దాతలు

వెదురుకుప్పం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పచ్చికాపల్లం నుంచి తిరుపతి వెళ్లే రోడ్డులో రాజబావి కనుమ సమీపంలో రోడ్డు మరమ్మతులకు ఇద్దరు స్నేహితులు ముందుకొచ్చారు. ఈ రోడ్డు గుంతలమయంగా మారింది. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. దీనిపై ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించకపోవడంతో పచ్చికాపల్లంకు చెందిన సువ్వాల ఆనందరెడ్డి, మొరవ గ్రామానికి చెందిన తులసిలు చొరవ తీసుకున్నారు. రోడ్డు బాగుచేయించడానికి నడుం బిగించారు. బుధవారం జేసీబీ సాయంతో గుంతలను పూడ్చివేతకు చర్యలు ప్రారంభించారు.

మున్సిపల్ కమిషనర్ల సీనియారిటీ జాబితా

అమరావతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పనిచేస్తున్న 22 మంది వర్కింగ్ మున్సిపల్ కమిషనర్ స్పెషల్ గ్రేడ్‌లకు, 49 మంది వర్కింగ్ మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-1 కేడర్‌కు సంబంధించి ప్రభుత్వం సీనియారిటీ జాబితా ప్రకటించింది. అలాగే, 13 మంది గ్రేడ్-2 కేడర్‌కు, 26 మంది గ్రేడ్-3 కేడర్‌కు సీనియారిటీ జాబితా ప్రకటిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు విడుదల చేసింది.

ద్రావిడ వర్సిటీ వీసీ ఎంపికకు సెర్చ్ కమిటీ

కుప్పం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్న ఉపకులపతి (వీసీ) ఎంపికకోసం ప్రభుత్వం ముగ్గురు సభ్యులతో కూడిన సెర్చ్ కమిటీని నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ నామినీ ఎన్ఐపీఆర్ గౌహతి డైరెక్టర్ యూఎస్ఎన్.మూర్తి, ఏపీఎస్‌సీహెచ్ఈ మాజీ వీసీ పి.నరసింహారావు, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నామినీ న్యూఢిల్లీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లివర్ అండ్ బైలరీ సైన్సెస్ ఎస్‌కే.షరీన్‌లు ఇందులో సభ్యులుగా ఉన్నారు. సాధ్యమైనంత త్వరలో సమావేశాన్ని ఏర్పాటుచేసి మూడు పేర్లతో కూడిన ప్యానెల్‌ను ప్రభుత్వానికి సమర్పించాలని సెర్చ్ కమిటీకి సూచించింది. సెర్చ్ కమిటీకి టీఏ, డీఏ, ఇతర వ్యయాలను ద్రావిడ వర్సిటీనిధులనుంచి చెల్లించాలనిప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా

పుంగనూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తీరుకు నిరసనగా టీడీపీ మైనారిటీ నాయకుడు సయ్యద్ సుహేల్‌బాషా ఆధ్వర్యంలో ధర్నా చేశారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి కమిషనర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సుహేల్‌బాషా మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్య పనులు సక్రమంగా చేయడం లేదని, కాలువల్లో నిల్వ ఉన్న పూడిక మట్టిని తొలగించాలని.. కమిషనర్‌ను అడిగితే సక్రమంగా సమాధానం ఇవ్వడంలేదన్నారు. ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో కమిషనర్ తనపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు ఆరోపించారు. మున్సిపల్ కార్యాలయం వైసీపీకి అడ్డాగా మారిందన్నారు. కమిషనర్ పట్టించుకోవడంలేదని ఆరోపించారు. కమిషనర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సద్దాంహుసేన్, ఇమ్రాన్, ప్రవేజ్, అస్లామ్, నూర్ తదితరులు పాల్గొన్నారు.













